www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
V3 NEWS
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
12-11-2024
సంపుటి : 01 | సంచిక : 190 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD



## రణరంగంగా మారిన ప్రజాభిప్రాయ సేకరణ

### కలెక్టర్‌పై తిరగబడ్డ రైతులు.. రాళ్లు, కర్రలతో దాడి



- ఫార్మాసంస్థ ఏర్పాటుకోసం గ్రామసభ
- ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంపై తీవ్ర అభ్యంతరం
- కలెక్టర్‌కు వ్యతిరేకంగా అన్నదాతల నినాదాలు
- వెనక్కి వెళ్లిపోవాలంటూ రాళ్లు విసిరిన రైతులు
- రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు దాడి

**విశ్వంభర, కొడంగల్:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజవకర్గం లగచర్ల గ్రామంలో ఓ ఫార్మాసంస్థ భూసేకరణ కోసం చేపట్టిన ప్రజాభిప్రాయసేకరణ రణరంగంలా మారింది. గ్రామసభ నిర్వహించేందుకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. గ్రామసభను ఊరికి దూరంగా ఏర్పాటుచేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. గ్రామసభ వద్ద ఉన్న ఇద్దరు రైతుల అభ్యంతరంతో కలెక్టర్ లగచర్ల గ్రామానికి చర్చల కోసం వెళ్లారు. కలెక్టర్ ఊళ్లోకి రాగానే ఆయనకు వ్యతిరేకంగా అన్నదాతలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ వెనక్కి వెళ్లిపోవాలంటూ కారుపై మిగతా2లో...

## రైతులను ఇబ్బంది పెడితే ఎస్మా ప్రయోగం

### అవసరమైతే ఎస్మా యాక్ట్ ప్రయోగానికి ఆదేశాలు



- ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలి
- ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సమస్యలను పరిష్కరించాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాంటి వ్యాపారులపై అవసరమైతే ఎస్మా (ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్) చట్టం కింద చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ సమస్యలపై మిగతా2లో...

## సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం



- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- నవంబరు 10తో ముగిసిన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం
- 2025 మే13 వరకు పదవిలో కొనసాగనున్న సీజే సంజీవ్ ఖన్నా
- ఆరేళ్లలో 450కిపైగా తీర్పుల్లో భాగస్వామిగా ఉన్న సీజే

2

## సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాల కుట్ర

- వారి ఆలోచనలను ప్రజలు గుర్తించి, తగిన బుద్ధి చెప్పాలి
- మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారు
- నైపుణ్యం కలిగిన యువతే దేశ భవిష్యత్తుకు అతిపెద్ద బలం: ప్రధాని మోదీ

2



## ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే

### చిరుమర్తి లింగయ్యకు నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. నిందితుడు తిరుపతన్నతో ఫోన్ కాంటాక్ట్స్ ఉండటంతో విచారణకు పిలిచారు. జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట విచారణకు హాజరు కావాలని తెలిపారు.

## శాంతిభద్రతల వైఫల్యానికి ఇదే నిదర్శనం

- సీఎం మూర్ఖత్వంతో అధికారులు దెబ్బలు తింటున్నారు
- ఆయన నియోజకవర్గంలోనే రైతులు తిరగబడ్డారు
- వికారాబాద్‌లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిపై కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:**

రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి సీఎం సొంత నియోజకవర్గంలో కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై దాడే నిదర్శనమని బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వికారాబాద్‌లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిపై ఆయన ఎక్స్ వేదికగా మిగతా2లో...





### ఏపీలో రూ.40వేల కోట్లతో టాటాపవర్ ప్రాజెక్టులు

- సీఎం చంద్రబాబుతో భేటీలో చైర్మన్ చంద్రశేఖరన్ నిర్ణయం
- భేటీలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చ

2

## కేసుల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ పర్యటన

- మేం ఎవర్నీ జైల్లో పెడతాం అనడం లేదు
- కేంద్రం వద్ద మోకరిల్లేందుకు కేటీఆర్ ఢిల్లీ వెళ్లారు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, హైదరాబాద్:** తనపై వస్తున్న ఆరోపణలు, కేసుల నుంచి తప్పించుకునేందుకే బీ ఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ టూర్‌కు వెళ్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బాధ్యతగల ప్రజాప్రతినిధిగా పోలీసుల విచారణకు కేటీఆర్ సహకరించాలన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. '' కేంద్ర సహాయం కోసం కలిసి ఢిల్లీ వెళ్దామంటే.. ప్రతిపక్షాలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు మాత్రం కేటీఆర్ ఢిల్లీకి పరుగెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి 'అమృత్' పథకంపై ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ చెబుతున్నారు. కార్ రేస్‌కు సంబంధించిన విచారణకు గవర్నర్ అనుమతి కోరాం. మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 110 | రిటైల్ ₹ 132 |
| స్కిన్ ₹ 191 | స్కిన్ లెస్ ₹ 218 |




## రూ.2.94 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

- ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్ లో కేటాయింపులు
- తల్లికి వందనంకు నిధులు కేటాయిస్తాం
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం
- రాష్ట్రాన్ని పునర్ నిర్మించే బాధ్యత మా ప్రభుత్వానిదే
- పెట్టుబడి దారులకు విశ్వాసాన్ని పెంచుతాం
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెంనాయుడు

**విశ్వంభర, అమరావతి:**

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,94,427.25 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొచ్చారు. బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం అంచనా రూ. 2,35,916.99 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ. 32,712.84 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ. 34,743.38 కోట్లు, ద్రవ్య లోటు రూ. 68,742.65 కోట్లుగా పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగం ద్వారా వెల్లడించారు. జీఎస్డీపీలో రెవిన్యూ లోటు 4.19 శాతం, జీఎస్డీపీలో ద్రవ్య లోటు 2.19 శాతంగా పేర్కొన్నారు.బడ్జెట్‌లో వివిధ కీలక రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు.అంతకు ముందు ఏపీ మంత్రివర్గం బడ్జెట్ ను ఆమోదించింది. ఈ బడ్జెట్ లో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులను వివరిస్తూనే.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. అమరావతి- పోలవరంకు మిగతా2లో...



## ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా దాడి

### హైఫా నగరమే లక్ష్యంగా రాకెట్లతో దాడులు

### 90 రాకెట్లు ప్రయోగం!

**జెరూసలెం:** ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా మరోసారి విరుచుకుపడింది. హైఫా నగరం లక్ష్యంగా సోమవారం రాకెట్లతో దాడులు చేసింది. దాదాపు 90 రాకెట్లు ప్రయోగించింది. ఈ దాడుల్లో పలువురు గాయపడగా.. అనేక భవనాలు, వాహనాలు ధ్వంసమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. మొదటగా దాదాపు 80 రాకెట్లు దూసుకొచ్చాయని.. వాటిలో అధిక సంఖ్యలో రాకెట్లను ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దీటుగా ఎదుర్కొందని ఇజ్రాయెల్ రక్షణ దళం వెల్లడించింది. వీటిలో కొన్ని మాత్రం నగరంలో మిగతా2లో...

## ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా దాడి..

(మొదటి పేజీ తరువాయి)
పలుచోట్ల పడినట్లు తెలిపింది. రెండో దఫా 10 రాకెట్లు దూసుకురాగా.. వాటన్నింటినీ అడ్డుకున్నట్లు పేర్కొంది. అయితే, హైఫా నగరంపై ఈస్థాయి దాడి జరగడం ఇది రెండోసారి. అక్టోబర్ 8న కూడా రెండు దఫాల్లో దాడులు జరగ్గా.. దాదాపు 100 రాకెట్లను హెజ్‌బొల్లా ప్రయోగించింది.

## సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం

**ఢిల్లీ:** ఎన్నికల బాండ్లు, అధికరణం 370 తదితర కేసుల్లో కీలక తీర్పులిచ్చిన జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సహా తదితరులు హాజరయ్యారు. సీజేఐగా జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఆయన స్థానంలో కొత్త సీజేఐ బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఏడాది మే 13 వరకు ఈయన పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా.. వచ్చే ఏడాది 2025 మే 13 వరకు సీజేఐగా కొనసాగుతారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా...ఈ ఆరేళ్ల కాలంలో 117 తీర్పులు రాశారు. 456 తీర్పుల్లో సభ్యుడిగా భాగస్వాములయ్యారు. ఈవీఎంల నిబద్ధతను సమర్థిస్తూ కీలకమైన తీర్పు వెలువరించారు. ఎన్నికల బాండ్ల పథకం రద్దు, అధికరణం 370 రద్దును సమర్థిస్తూ తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. మద్యం కుంభకోణంలో దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుచేశారు.

## సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాల కుట్ర

**వడ్తాల్:** కులం, మతం, భాష, లింగం ప్రాతిపదికన సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీ స్వామినారాయణ ఆలయం 200వ వార్షికోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని వడ్తాల్‌లో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. కులగణన ను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్షాలను దుయ్యబడుతూ తమ స్వార్థ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించాలని చూసే వారి ఆలోచనలను ప్రజలు గుర్తించి, తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. దేశ వ్యతిరేకులు పన్నే కుట్రలను దేశ ప్రజలంతా కలసికట్టుగా ఎదుర్కోవాలని మోదీ పిలుపునిచ్చారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర వెనకబడిన తరగతులు అభివృద్ధి చెందడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందని ప్రధాని మోదీ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఓబీసీలలోని కులాలను విభజించడానికి చూస్తున్నారని మండిపడ్డారు. దేశం వేగంగా అభివృద్ధి చెందడానికి బలమైన, సమర్థులైన, విద్యావంతులైన యువతను తయారుచేయాలని పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన యువతే దేశ భవిష్యత్తుకు అతిపెద్ద బలం అవుతుందన్నారు. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని.. తాను ఏ దేశ నాయకులను కలిసినా భారత యువతలో ఉన్న ప్రతిభను పొగుడుతూ.. వారికి తమ దేశంలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నారని పేర్కొన్నారు. 2027లోపు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల వరుసలో నిలబెట్టడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని.. ఈ బాధ్యతను దేశ పౌరులు కూడా తీసుకోవాలని అన్నారు.

## రైతులను ఇబ్బంది పెడితే ఎస్మా ప్రయోగం

(మొదటి పేజీ తరువాయి)
సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతుల పంట కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే సహించేంది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రైతులను గందరగోళానికి గురి చేయటం, వేధించటం వంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రమంతటా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లపై అంతగా దృష్టి సారించకపోవడం, కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు లేకపోవడం వల్ల అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిబంధనల సాకుతో నిర్వాహకులు, మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు ధాన్యం తరలించేందుకు కావల్సిన గోనె సంచుల కొరత, తూకం ఆలస్యంగా వేయడం, ధాన్యం తీసుకెళ్లేందుకు వాహనాలు లేకపోవడం వంటి కారణాలు రైతులకు ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. దీనికి అప్పుడప్పుడు కురిసే అకాల వర్షాలతో కూడా రైతులకు నష్టం తప్పడం లేదు.దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ సమీక్ష నిర్వహించారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని, ధాన్యం కొనుగోళ్లు, తరలింపు వెంట వెంటనే జరగాలని, ఎక్కడైనా జాప్యం జరిగితే వ్యాపారులతో బాధ్యత అని హెచ్చరించారు.

### బాధ్యతగల ప్రజా ప్రతినిధిగా ఆయన పోలీసుల

## విచారణకు సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)
మేం ఎవర్నీ జైల్లో పెడతాం అనడం లేదు. తన రక్షణ కోసం కేంద్రం వద్ద మోకరిల్లేందుకు కేటీఆర్ దిల్లీ వెళ్లారు. అలా ప్రజల దృష్టిని మరలిస్తున్నారు. అమృత్ పథకంలో అవినీతి జరిగితే కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చు. కానీ, మీ మీద జరిగే విచారణను తప్పించుకునేందుకే దిల్లీ వెళ్తున్నట్లు తెలుస్తోంది. విచారణకు సహకరించండి.. మీ చిత్తశుద్ధి నిరూపించుకోండి. ఈ నెల 14 నుంచి ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుతాం. ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతి మంచి పనిని ప్రజలకు వివరిస్తాం. రవాణాశాఖకు మరింత గౌరవం పెరిగేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే తెలంగాణ రవాణాశాఖ లోగోను విడుదల చేస్తాం'' అని పొన్నం వెల్లడించారు.

## ఇప్పుడే దిల్లీలో కాలు పెట్టా.. అప్పుడే వణికితే ఎలా..?

### కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ సెటైర్లు

**విశ్వంభర, దిల్లీ:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. నేను ఇప్పుడే దిల్లీలో అడుగుపెట్టాను.. అప్పుడే హైదరాబాద్ ప్రకంపనలు ప్రారంభమైనట్లు తెలిసింది. అప్పుడే వణికితే ఎలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.రేవంత్ అవినీతి, అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు కేటీఆర్ సోమవారం మధ్యాహ్నం దిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే.అమృత్ పథకం టెండర్లలో రేవంత్ తన బావమరది సృజన్ రెడ్డికి లాభం చేకూర్చేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇప్పటికే ఈ విషయం లేఖ ద్వారా కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. ఇప్పుడు కేంద్ర మంత్రిని నేరుగా కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు కేటీఆర్ దిల్లీకి వెళ్లారు.

# రూ.2.94 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)
ప్రత్యేక అంశాలుగా గుర్తించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్ లో కేటాయింపులు చేసారు. రానున్న నాలుగు నెలల కాలానికి సంబంధించిన కేటాయింపులను బడ్జెట్ లో ప్రతిపాదించారు. సూపర్ సిక్స్ లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశ పెడతామని ప్రభుత్వం బడ్జెట్ లో ప్రకటించింది.

**తల్లికి వందనం.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం**

ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కృషి చేస్తామని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకానికి నిధులు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 1-12వ తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉందని కేశవ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేసారు. పెట్టుబడి దారుల విశ్వాసాన్ని పెంచుతామని హామీ ఇచ్చారు.అమరావతిలో నిర్మాణాలు.. ఔటర్ రింగ్ రోడ్ పనులు.. కేంద్రం నుంచి అందుతున్న సహకారం గురించి కేశవ్ వివరించారు. ఆ తర్వాత వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభను ఎల్లుండికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

**శాఖల వారీగా కేటాయింపులు ఇవీ..**

పాఠశాల విద్య - రూ.29,909 కోట్లు
వ్యవసాయం, అనుబంధ రంగాలు - రూ.11,855 కోట్లు
ఎస్సీ సంక్షేమం - రూ.18,497 కోట్లు
ఎస్టీ సంక్షేమం - రూ.7,557 కోట్లు
బీసీ సంక్షేమం - రూ.39,007కోట్లు
మైనార్టీల సంక్షేమం - రూ.4,376 కోట్లు
మహిళా శిశు సంక్షేమం - రూ.4,285 కోట్లు
మానవ వనరుల అభివృద్ధి - రూ.1,215 కోట్లు
ఉన్నత విద్య - రూ.2,326 కోట్లు
ఆరోగ్య రంగం - రూ.18,421 కోట్లు
పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి - రూ.16,739 కోట్లు
పట్టణాభివృద్ధి - రూ.11490 కోట్లు
గృహ నిర్మాణం - రూ.4,012 కోట్లు
జలవనరులు - రూ.16,705 కోట్లు
పరిశ్రమలు, వాణిజ్యం - రూ.3,127 కోట్లు
ఇంధన రంగం - రూ.8,207 కోట్లు
రవాణా, రోడ్లు, భవనాలు - రూ.9,554 కోట్లు
యువజన, పర్యాటక, సాంస్కృతికం - రూ.322 కోట్లు
పోలీస్ శాఖ - రూ.8,495 కోట్లు
పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ - రూ.687 కోట్లు



వ్యవసాయ రంగానికి రూ.43,402 కోట్ల కేటాయింపులు ఇలా..

శాసనసభలో మంత్రి అచ్చెన్నాయుడు రూ.43,402.33 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. భూసార పరీక్షలకు రూ.38.88కోట్లు, విత్తనాలు పంపిణీ కి రూ. 240కోట్లు, ఎరువుల సరఫరాకు రూ.40కోట్లు, పొలం పిలుస్తోంది రూ.11.31కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.422.96కోట్లు కేటాయించారు. డిజిటల్ వ్యవసాయం రూ.44.77కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణ రూ.187.68కోట్లు, వడ్డీలేని రుణాలకు రూ.628కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.4500కోట్లు, రైతు సేవా కేంద్రాలకు రూ.26.92కోట్లు కేటాయించారు.

## ప్రజలు ఏం కోల్పోలేదు... పెద్దాయన ఇంట్లో నాలుగు ఉద్యోగాలు తప్ప

**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బాట పట్టారని కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 50 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడం తనకు సంతృప్తిని ఇస్తుందన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో 99 మంది ఏఎంవీఐలకు సీఎం ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు.



10 నెలల్లో ఏం కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని ఒక పెద్దాయన అంటున్నారని తెలంగాణ ఏం కోల్పోలేదని, పెద్దాయన ఇంట్లో మాత్రం నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ ఒక్కటైనా కట్టిందా అని ప్రశ్నించారు. రెసిడెన్షియల్ స్కూల్ కట్టలేదు కానీ ఆయన మాత్రం 10 ఎకరాల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని అన్నారు. 2011లో రాష్ట్రంలో చివరిసారిగా గ్రూప్-1 నిర్వహించారని దాదాపు 13 ఏళ్లపాటు గ్రూప్-1 నిర్వహించలేదని తెలిపారు. ఎన్ని ఆటంకాలు పెట్టినా పట్టుబట్టి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించానని త్వరలో గ్రూప్-1 నియామకపత్రాలు అందజేస్తాని తెలిపారు.

ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బాట పట్టారని కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 50 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడం నాకు సంతృప్తిని ఇస్తుందన్నారు. ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో 99 మంది ఏఎంవీఐలకు సీఎం ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు.

**దేశంలో మోదీ, గాంధీ.. రెండే వర్గాలు: సీఎం రేవంత్**

మైనారిటీ సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ''మెజారిటీ, మైనారిటీ ఇద్దరూ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటి వారు. స్వాతంత్ర్యం రాగానే మౌలానా అబుల్ కలామ్‌ను నెహ్రూ విద్యాశాఖ మంత్రిని చేశారు. విద్యా వ్యవస్థలో మౌలానా అబుల్ కలామ్ అనేక విధానాలు తెచ్చారు. దేశంలో 2 వర్గాలే ఉన్నాయి ఒకటి మోదీ వర్గం.. మరొకటి గాంధీ వర్గం. హిందూ ముస్లిం భాయి భాయి అన్నదే కాంగ్రెస్ విధానం. చార్మినార్ వద్ద గతంలో రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేశారు. అదే చార్మినార్ వద్ద రాహుల్ గాంధీ కూడా సద్భావన యాత్ర చేశారు. నాలుగు ఎమ్మెల్సీల్లో ఒకటి మైనారిటీలకు ఇచ్చాం. ఈ ప్రభుత్వంలో అనేక పదవులు అప్పగించాం. మైనారిటీలకు మా పార్టీ 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది. వాళ్ల రిజర్వేషన్లను రద్దు చేసేందుకు మోదీ యత్నిస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఓడించాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## శాంతిభద్రతల వైఫల్యానికి ఇదే నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)
స్పందించారు. రైతులు ఏకంగా కలెక్టర్‌పై తిరగబడ్డారని అన్నారు. ''సీఎం మూర్ఖత్వం వల్ల అధికారులు దెబ్బలు తింటున్నారు. రేవంత్‌రెడ్డి దురాశ, అవగాహన రాహిత్యం వల్లే ఈ దుస్థితి తలెత్తింది. ఫార్మాసిటీ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న భూములను రద్దు చేశారు. పదిచోట్ల ఫార్మాక్లస్టర్లు పెట్టాలనే ఆలోచన వల్లే ఇంత అలజడి రేగింది. సేకరించిన భూములను అమ్ముకొని సొమ్ము చేసుకోవాలనుకున్నారు. ఇప్పుడు ఫార్మాసిటీ భవితవ్యం ప్రమాదంలో పడింది. కొడంగల్‌లో అన్నదాతల భూములు గుంజుకునే కుట్ర మొదలైంది. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే భూస్థాపితం కాబోతోంది'' అని కేటీఆర్ అన్నారు.

**ఇదిప్రజాపాలనా ? ప్రతీకార పాలనా ?**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో కొనసాగుతున్నది ప్రజాపాలనా ? లేక ప్రతీకార పాలనా ? అని బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలు సరే పథకాలేవి.. పాలనేది? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆరు గ్యారంటీలను ఎందుకు అమలుచేయడం లేదన్నారు. కేంద్రాల్లో ధాన్యం కొనేవారు లేక రైతన్నలు కన్నీళ్లు పెడుతున్నారని, హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూలుస్తున్నా, రైతు భరోసా అందక రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ హైకమాండ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ అని, అరకొర రుణమాఫీతో రైతులను ఇబ్బంది పెడుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం పట్టించుకోవడంలేదని కేటీఆర్ మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నా.. దానిపై ప్రభుత్వం కనీసం సమీక్షించడంలేదని ఆక్షేపించారు. అదేవిధంగా గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలపై నిరుద్యోగులు అడుగుతున్న డిమాండ్లను నెరవేర్చడంలేదన్నారు. ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 , అవ్వ, తాతలకు నెలకు రూ.4,000 పింఛను ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో నడుస్తున్నది ఏసీబీ, జేసీబీ సర్కార్ అని, కూల్చడం తప్ప నిలబెట్టడం తెలియదని వ్యాఖ్యానించారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస.. 11 మంది మిలిటెంట్లు హతం!

**ఇంఫాల్:** మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. ఈ క్రమంలో జిరిబామ్ జిల్లాలో మిలిటెంట్లు, భద్రత బలగాల మధ్య కాల్పుల్లో 11 మంది సాయుధులు మృతిచెందారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పై దాడులకు తెగబడిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. వీరంతా కుకీ తిరుగుబాటుదారులుగా అనుమానిస్తున్నారు. మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లా బోరోబెక్రా పోలీస్ స్టేషన్‌పై సోమవారం మధ్యాహ్నం కొందరు సాయుధులు దాడులకు పాల్పడ్డారు. అనంతరం సమీపంలో ఉన్న జకురాడోర్ కరోంగ్ గ్రామం వైపు దూసుకెళ్లి బీభత్సం సృష్టించారు. అనేక దుకాణాలకు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలు--మిలిటెంట్ల మధ్య భారీ స్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలోనే 11 మంది మిలిటెంట్లు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. అటు కొంతమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు కూడా గాయాలైనట్లు సమాచారం. ఇదిలాఉంటే, బిష్ణుపూర్ జిల్లాలో ఇటీవల మిలిటెంట్ల దాడిలో ఓ మహిళ మృతి చెందడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇంఫాల్ లోయలోని సైటాన్ ప్రాంతంలో నవంబర్ 9న ఈ ఘటన చోటుచేసుకుంది. పొలంలో పని చేస్తున్న రైతులను లక్ష్యంగా చేసుకుని సాయుధులు జరిపిన కాల్పుల్లో మహిళ మృతిచెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఏపీలో రూ.40వేల కోట్లతో టాటాపవర్ ప్రాజెక్టులు

**విశ్వంభర, అమరావతి:** పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని టాటా గ్రూప్, ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్, ఏపీ సీఎం చంద్రబాబు , మంత్రి లోకేశ్ మధ్య జరిగిన భేటీలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. పర్యాటకం, పారిశ్రామిక వృద్ధిని పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా మరో 20 హోటళ్లను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. తాజ్, వివాంటా, గేట్‌వే, సెలెక్యూషన్స్, జింజర్ హోటల్స్, ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు టాటా గ్రూప్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు రూ.40వేల కోట్ల పెట్టుబడితో టాటా పవర్ సోలార్, విండ్ ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విశాఖపట్నంలో టీసీఎస్ ఏర్పాటు ద్వారా 10వేల ఉద్యోగాల కల్పనకు కొత్త ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రతన్ టాటా ఎంతో కృషి చేశారని సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. రతన్ టాటా వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ ఆయన దార్శనిక నాయకత్వంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో టాటా గ్రూప్ ముఖ్యమైన వాటాదారుగా కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ప్రాథమిక ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతికత, ఏఐ పరిష్కారాలను ఆవిష్కరించడానికి పరస్పర సహకారాన్ని అన్వేషించిన్నట్లు సీఎం వెల్లడించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రతీ కుటుంబం నుంచి ఓ పారిశ్రామిక వేత్త తయారయ్యేందుకు వీలు కలుగుతుందన్నారు. అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పించటమే రతన్ టాటాకు నిజమైన నివాళి అని చంద్రబాబు పేర్కొన్నారు

## రణరంగంగా మారిన ప్రజాభిప్రాయ సేకరణ

(మొదటి పేజీ తరువాయి)
రాళ్లు విసిరారు. కారు దిగి రైతులతో చర్చించేందుకు వచ్చిన కలెక్టర్ అన్నదాతలను ఒప్పించేందుకు ప్రయత్నించారు. సహనం కోల్పోయిన స్థానిక రైతులు కలెక్టర్ , తహశీల్దార్‌ల కార్లపై రాళ్లు విసిరారు. పరిస్థితిని గమనించి అక్కడి నుంచి కలెక్టర్, రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు.

**రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు దాడి**

పరిస్థితిని ముందే ఊహించి భారీ బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ.. పోలీసులంతా గ్రామసభ జరిగే ప్రాంతంలో మోహరించారు. చర్చల కోసం వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ వద్ద భద్రత లేకపోవడం గ్రామస్థులు దాడికి దిగడానికి అనుకూలంగా మారింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలంలో 1,350 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి ఫార్మా కంపెనీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఇక్కడ ప్రభుత్వ భూమి 156 ఎకరాలే ఉంది. మిగతాది పట్టాభూముల నుంచి సేకరించాలి. దీన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణ ఉద్రిక్తతకు దారితీసింది. ఫార్మాసంస్థ ఏర్పాటుకు కారణం సదరు కాంగ్రెస్ నాయకుడే అంటూ ఆయన కారుపై రాళ్లు రువ్వి, అద్దాలు ధ్వంసం చేశారు. రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు తిరగబడ్డారు. పరిస్థితి అదుపుచేసేందుకు లాఠీఛార్జి చేసి ప్రజలను చెదరగొట్టాల్సి వచ్చింది. రైతులు మాత్రం బంగారం లాంటి తమ భూములను ఔషధ కంపెనీకి ఇచ్చేదే లేదంటూ తెగేసి చెబుతున్నారు. బలవంతంగా భూసేకరణ చేపడితే మాత్రం ఎంతవరకైనా వెళతామని హెచ్చరిస్తున్నారు.

## సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా.. తొలిరోజే 45 కేసుల విచారణ!



**ఢిల్లీ:** జస్టిస్ సంజీవ్ ఖన్నా భారత 51వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి హోదాలో మొదటి రోజే ఆయన 45 కేసులను విచారించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించిన తర్వాత సీజేఐ హోదాలో తొలిసారి కోర్టు హాలులోకి అడుగుపెట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అక్కడున్న న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పదవీ కాలం ఫలవంతంగా సాగాలని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, తదితరులు ఆకాంక్షించారు. తనకు శుభాకాంక్షలు చెప్పిన వారందరికీ సీజేఐ ధన్యవాదాలు తెలిపారు.ఈ మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా.. లిస్ట్ చేసిన 45 అంశాలపై విచారణ జరిపారు. వీటిలో వాణిజ్యపరమైన వివాదాలకు సంబంధించినవే అధికం.



# రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రారంభం

**విశ్వంభర, వేములవాడ :**

నంది కమాన్ వద్ద నిర్మించిన రంగవల్లి విజ్ఞాన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, పలువురు రచయితలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క లు ప్రారంభించారు. నిజం కాలం నుండి పోరాటం చేసిన గొప్ప మహిళ అని వక్తలు కొనియాడారు. రంగవల్లి విజ్ఞాన కేంద్రంను ఉపయోగించుకోవాలి అని ,దొరల పాలనకి వ్యతిరేఖంగా పోరాటం చేశారని గుర్తు చేసారు. రంగవల్లి స్ఫూర్తి దాయకమంటు బూర్జువ, భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటలు చేసారు అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలకు వ్యతిరేఖంగా



పోరాటం చేస్తూ, అదివాసి బిడ్డలకు అండగా నిలబడ్డారు. రంగవల్లి విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమాలలో పని చేశారు. ప్రగతి శీల సంఘంలో, విప్లవ పార్టీలో కొనసాగుతూ పేద ప్రజల కోసం అనేక పోరాటం చేసి గొప్ప వ్యక్తి అని కొనియాడారు.



# టీఎఫ్ సీసీ ఈసీ మెంబర్‌గా కోదుమూరి నియామకం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ప్రసాద్ ల్యాబ్ నందు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. వారి చేతుల మీదుగా దయాకర్ రావు నియామక పత్రం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా పార్టీ లో చేసిన విశేషమైన సేవలను గుర్తించి వీరిని నియామకం చేశారు. వీరి నియామకం పట్ల వి-3 న్యూస్ ఛానల్, విశ్వంభర దిన పత్రికల చైర్మన్ డా. కాచం సత్యనారయణ,



డా. యర్రమాద కృష్ణారెడ్డి, దాము మహేందర్ యాదవ్, శ్రీధర్, హేమలత, వేమిశెట్టి వెంకటేశ్వరరావు, కోడుమూరు జగన్నాథం, కోడుమూరి భాను ప్రకాష్, మహేష్ ,కూర రమేష్ తదితరులు ఉన్నారు.

# టీజీపీఎస్సీ ఛైర్మన్ నియామకానికి నోటిఫికేషన్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 20న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. టీజీపీఎస్సీ ప్రస్తుత ఛైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ఈ ఏడాది డిసెంబర్ 3తో ముగియనుంది.

# ప్రియాంకా గాంధీకి రాహుల్ ఛాలెంజ్!

**వయనాడ్:** వయనాడ్ ఉప ఎన్నికకు సమయం సమీపిస్తోంది. మరోసారి ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ స్థానం నుంచి బరిలోకి దిగిన పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా గెలుపు కోసం రాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఇక్కడి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. తన సోదరికి ఓ సవాల్ విసిరారు. వయనాడ్‌ను ఉత్తమ పర్యటక ప్రదేశంగా మార్చాలని రాహుల్ ఆమెకు ఛాలెంజ్ చేశారు. ''రాజకీయాలకు అతీతంగా వయనాడ్‌కు నా హృదయంలో గొప్ప స్థానం ఉంది. ఇక్కడున్న ప్రతి ఒక్కరికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా. ఈ ప్రాంత అందాలను ప్రపంచానికి చూపించాలి. ఉత్తమ పర్యటక ప్రదేశంగా మార్చడానికి ప్రియాంక కృషి చేయాలి. ఎవరైనా కేరళ వస్తే మొదట ఈ ప్రాంతమే గుర్తుకు రావాలి. కాబోయే ఎంపీ ఇది ఛాలెంజ్‌గా తీసుకోవాలి. ఈ ప్రాంతానికి మంచి జరిగితే.. అది నాకెంతో సంతోషానిస్తుంది'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాగా.. సార్వత్రిక ఎన్నికల్లో వయనాడ్, రాయ్‌బరేలీ సీట్లలో రాహుల్ గాంధీ గెలుపొందిన సంగతి తెలిసిందే. వయనాడ్‌ను వదులుకోవడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది.

# పంట పొలాల్లో ఫార్మా కంపెనీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

## మాజీ మంత్రి హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** ఫార్మా సిటీ పేరుతో పచ్చని పంట పొలాలను సేకరించడాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు ఆక్షేపించారు. రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని.. అది సీఎం సొంత జిల్లా వికారాబాద్ రైతులపై పడిందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. అందుకే రైతులు సీఎం మీద ఉన్న కోపాన్ని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులపై చూపుతున్నారని



చెప్పారు. రేవంత్ చేస్తున్న అసమర్థ పాలనకు ఐఏఎస్‌లు, ప్రభుత్వ అధికారులు ప్రజాగ్రహానికి గురవుతున్నారని మాజీ మంత్రి పేర్కొన్నారు. కేసీఆర్.. ఫార్మాసిటీ కోసం హైదరాబాద్‌కు దగ్గరగా, కాలుష్యం లేకుండా, జీరో వ్యర్థాలతో 15 వేల ఎకరాలను సేకరించి సిద్ధం చేశారని తెలిపారు. పర్యావరణం, అటవీ సహా అన్ని రకాల అనుమతులు వచ్చిన దాన్ని పక్కన పెట్టి పచ్చటి పంట పొలాల్లో ఫార్మా చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా పిచ్చి పనులు మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని కోరారు. పచ్చని పంట పొలాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్‌లో చండూర్ విద్యార్థుల ప్రతిభ

- ఫైనిర్ షోటోకాన్ కరాటేలో పాల్గొన్న 17 మంది విద్యార్థులు
- మాస్టర్ కారింగు రవిని సన్మానించిన నిర్వాహకులు

**విశ్వంభర, హైద్రాబాద్;** తెలంగాణ రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ 2024 ను పురస్కరించుకొని ఫైనిర్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజాపూర్ లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో నల్గొండ జిల్లా చండూర్ కు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న 17 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. చండూర్ మండలంలోని గాంధీజీ,




గీతా , కృష్ణవేణి పాఠశాలల నుండి 17 మంది పాల్గొన్నారని మాస్టర్ కారింగు రవి తెలిపారు. 17 మంది విద్యార్థులకు పతకాలు రావడం సంతోషంగా ఉందని మాస్టర్ రవి అన్నారు. ఫైనిర్ షోటకాన్ కరాటే లో కారింగు అభిరామ్ , సంగెపు హర్ష, సంకోజు మణిదీప్ ఈ ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఏడుగురు విద్యార్థులు అయిన కారింగు మోక్షలక్ష్మి, సంగెపు గాయత్రి, జే. ఓం, సంగెపు జాశ్వంత్, కావలి శశాంక్, ఐతరాజు జశ్వంత్, సంగెపు చందు వెండి పతకాలు సాధించుకున్నారు. మరో 7 గురు విద్యార్థులకు సంగెపు అభిరామ్, కారింగు అనురూప్, సంకోజు సాయి ప్రణయ్, ఇరిగి బానుతేజ, బుచ్చాలా దినేష్, సంగెపు బద్రేష్, బొమ్మకంటి రేవంత్ కాంస్య పతకాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల మాస్టర్ అయిన కారింగు రవి ని సన్మానించి అభినందనలు తెలిపారు నిర్వాహకులు . రాపోలు సుదర్శన్, జపాన్ కరాటే అసోసియేషన్ అఫ్ ఇండియా తెలంగాణ చీఫ్ ఇన్స్ట్రక్టర్, పలువురు మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.









# న్యాయవాది నుంచి న్యాయ వ్యవస్థలో శిఖరాగ్రస్థానానికి..



## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా..

సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు. సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.వచ్చే ఏడాది మే 13వ తేదీ వరకు సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా కొనసాగనున్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన శిఖరాగ్రస్థానమైన భారత ప్రధాన న్యాయమూర్తి స్థాయికి ఎదిగారు. ఎన్నికల బాండ్లు, ఈవీఎంలు, ఆర్టికల్ 370 తదితర కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు కీలకమైన తీర్పులలో భాగస్వాములయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా జీవిత విశేషాలపై విశ్వంభర ప్రత్యేక కథనం..

**న్యాయమూర్తుల కుటుంబం నుంచి వచ్చారు..**

జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి జస్టిస్ దేవరాజ్ ఖన్నా దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. చిన్నాన్న జస్టిస్ హన్సరాజ్ ఖన్నా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు.దిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా 1980లో దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకున్నారు. అదే యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించారు. 1983లో దిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరును నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా న్యాయస్థానంలో తొలుత ప్రాక్టీస్ చేశారు. 2004లో దిల్లీ ప్రభుత్వం తరఫున నేషనల్ క్యాపిటల్ టెరిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. 2005లో దిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తన చిన్నాన్న జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా కూర్చొన్న కోర్టు గది నుంచి తన మొదటి రోజును ప్రారంభించారు. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు.అంతేకాకుండా భోపాల్‌లోని నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ పాలక మండలి సభ్యుడిగానూ కొనసాగుతున్నారు. ఏ హైకోర్టుకూ చీఫ్ జస్టిస్‌గా పని చేయకుండానే నేరుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఘనత సాధించిన అతి కొద్దిమంది న్యాయమూర్తుల్లో జస్టిస్ ఖన్నా ఒకరు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నాకు ఆయన స్వయానా సోదరుడి కుమారుడు. ముఖ్యమైన రాజ్యాంగసంబంధ కేసుల్లో పెదనాన్న జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా ఇచ్చిన తీర్పులతో స్ఫూర్తి పొంది న్యాయవాద వృత్తివైపే మొగ్గుచూపారు. సంజీవ్ ఖన్నా.. పబ్లిక్ లా వ్యవహారాలు, ప్రత్యక్ష పన్ను అప్పీళ్లు, ఆదాయపు పన్ను ప్రాసిక్యూషన్‌లు, మధ్యవర్తిత్వ కేసులు, వాణిజ్య సూట్లు, పర్యావరణం, కాలుష్య చట్టాల విషయాల్లో రిట్ పిటిషన్‌లు, వినియోగదారుల ఫోరమ్‌ల ముందు వైద్యపరమైన నిర్లక్ష్యం కేసులు, కంపెనీ లా కేసులు సహా అనేక రకాల న్యాయ రంగాలలో విశేష అనుభవం కలిగినవారు.

**ఇటీవలే మార్నింగ్ వాక్ ను వదులుకొన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా..**

జస్టిస్ సంజీవ్ ఖన్నా భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందే తనకు ఎంతో ఇష్టమైన ఒక అలవాటును ఆయన వదులుకోవాల్సి వచ్చింది. ప్రతి రోజూ ఉదయం ఎంతో ఇష్టంగా కొన్ని కిలోమీటర్ల మేర మార్నింగ్ వాకింగ్ చేయడం ఆయనకు అలవాటు. తనను ఎవరూ గుర్తుపట్టరనే నమ్మకంతో దిల్లీలోని లోధి గార్డెన్ ప్రాంతం, తన ఇంటి చుట్టుపక్కల ఒంటరిగా వాకింగ్ చేస్తుండేవారు. అయితే గత నెలలో సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. భద్రతా సిబ్బందితో మార్నింగ్ వాక్‌కు వెళ్లాలని భద్రతా అధికారులు ఆయనకు సూచన చేశారు. అయితే చాలా సాధారణ జీవితాన్ని గడపడానికి ఇష్టపడే జస్టిస్ సంజీవ్ ఖన్నా మార్నింగ్ వాక్‌కు వెంట సెక్యూరిటీని తీసుకెళ్లడం ఇష్టంలేదని తిరస్కరించారు. ఆ అలవాటునే పూర్తిగా మానేయాలని ఆయన నిర్ణయించుకున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా స్ఫూర్తితో!**

జస్టిస్ సంజీవ్ ఖన్నాను తండ్రి అకౌంటెంట్ వృత్తిలోకి పంపించాలనుకున్నారు. అయితే ముఖ్యమైన రాజ్యాంగసంబంధ కేసుల్లో పెదనాన్న జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ఇచ్చిన తీర్పులతో స్ఫూర్తిపొందిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా న్యాయవాద వృత్తివైపే మొగ్గుచూపారు. ఇందిరాగాంధీ అత్యయిక పరిస్థితి విధించిన సమయంలో జరిగిన ఏడీఎం జబల్‌పూర్ కేసు(1976)లో ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేయొచ్చని అయిదుగురు సభ్యుల ధర్మాసనం 4:1 మెజార్టీతో ఇచ్చిన తీర్పును వ్యతిరేకించిన ఏకైక ధర్మాసన సభ్యుడిగా జస్టిస్ హెచ్‌ఆర్‌ఖన్నా చరిత్రపుటలకెక్కారు. ఆ కారణంగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ సీనియారిటీ పరంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే వరుసలో ఉన్న ఆయన్ను పక్కనపెట్టి జస్టిస్ ఎం.హమీదుల్లాబేగ్‌ను సీజేఐగా చేశారన్న వాదన ఉంది. ఆ కారణంగా జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా తన పదవీకాలం ముగియడానికి మూడునెలల ముందే సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి రాజీనామా చేశారు. రాజ్యాంగ మూలస్వరూపాన్ని మార్చకూడదన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కేశవానందభారతి కేసు (1973) ధర్మాసనంలోనూ జస్టిస్ హెచ్‌ఆర్‌ఖన్నా ఉన్నారు.

## చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామిగా సంజీవ్ ఖన్నా..

2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఆరేళ్ల కాలంలో 117 తీర్పులు రాశారు. 456 తీర్పుల్లో సభ్యుడిగా భాగస్వాములయ్యారు. ఒక టీవీ షోలో వ్యాఖ్యలపై జర్నలిస్టుపై చేసిన కేసులో, ఆర్టికల్ 21 ద్వారా హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కును కొట్టిపారేయడానికి ఆర్టికల్ 19(1)(ఎ)ని సేవలోకి నెట్టలేమని ఆయన నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. , ఇతరులకు వినడానికి లేదా వినడానికి, నిరాకరించడానికి హక్కు ఉంటుంది అంటూ ఎఫ్ ఐ ఆర్ రద్దు చేయడానికి నిరాకరించారు .సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌కు క్లియరెన్స్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌లో భాగమైన జస్టిస్ ఖన్నా ఈ విషయంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాసుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పలు చరిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ముఖ్యంగా ఈవీఎంలపై అనుమానాలకు సంబంధించిన కేసుల్లో కీలక తీర్పు చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు(ఈవీఎంలు) సంబంధించి వీవీప్యాట్లలోని 100 శాతం ఓట్లను లెక్కించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2024లో కొట్టివేసిన డివిజన్ బెంచ్‌కు ఆయన నేతృత్వం వహించారు. ఈవీఎంలు సురక్షితమైనవని, బూత్‌ల ఆక్రమణ, బోగస్ ఓటింగ్‌లకు చెక్ పెడతాయని స్పష్టం చేయడమే కాకుండా ఎన్నికల్లో ఈవీఎంల వినియోగాన్ని సమర్థిస్తూ తీర్పు వెలువరించారు. జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఈవీఎం తారుమారు అనుమానాన్ని "నిరాధారమైనది" అని పేర్కొంది. పాత పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి మార్చాలనే డిమాండ్‌ను తిరస్కరించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) ద్వారా పోలైన ఓట్లను ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్)తో నూటికి నూరు శాతం ధ్రువీకరించాలన్న అభ్యర్థనను ఆయన తోసిపుచ్చారు. ప్రస్తుతం ఒక నియోజకవర్గంలో ర్యాండమ్‌గా ఎంపిక చేసిన ఐదు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే వీవీప్యాట్ పరిశీలిస్తున్నారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) పరిధిలోకి సుప్రీంకోర్టు కార్యాలయం వస్తుందంటూ 2019లో మరో కీలక తీర్పు వెలువరించారు. వివాహ బంధం పూర్తిగా విఫలమైన సందర్భాల్లో దంపతులకు నేరుగా విడాకులు మంజూరు చేసే అధికారం ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉందని 2023లో స్పష్టంచేశారు. అలాగే, ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధం అంటూ తీర్పు వెలువరించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్నారు.ఆయన నేతృత్వంలోని బెంచ్ కూడా రాజకీయ నిధులలో పారదర్శకత ఆవశ్యకతను నొక్కి చెబుతూ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. దాతలకు గోప్యతాహక్కు లేదంటూ కేంద్ర ఎన్నికల బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో జస్టిస్ ఖన్నా ప్రత్యేక అభిప్రాయాన్ని రాశారు.




ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సమర్థిస్తూ 2023లో తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా సభ్యుడిగా ఉన్నారు.జమ్ముకశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును ఆయన సమర్థించారు. ఈ రద్దు ఫెడరల్ వ్యవస్థను నిర్వీర్యం చేయదని ఆయన వాదించారు. దేశంలోని ఇతర ప్రాంతాలలోని పౌరులమాదిరిగానే కశ్మీర్ పౌరులుకూడా జీవిస్తారని, వారు కూడా ఒకేరకమైన హోదాను అనుభవిస్తారని చెప్పారు.లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతం ఏర్పాటును సమర్థిస్తూ కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనను రికార్డు చేయడంపై ఆయన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌తో ఏకీభవించారు.కానీ ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం తీవ్ర పరిణామాలను కలిగిస్తుందని, సమాఖ్య విధానానికి విఘాతం కలిగిస్తుందని ఆయన తన ప్రత్యేక తీర్పులో స్పష్టంగా పేర్కొన్నారు.కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పాటును సమర్థించడానికి బలమైన కారణాలు అవసరమని, అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 3కి కచ్చితంగా లోబడి ఉండాలని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన బెంచ్‌లో ఆయన కూడా భాగమయ్యారు, కేజ్రీవాల్ కు ఈ ఏడాది మే, జూన్ లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేయడానికి వీలు కల్పించారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తొలుత మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం 90 రోజులకు పైగా సుదీర్ఘ జైలు శిక్షను అనుభవించిన కారణంగా జులైలో ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ మంజూరైన తర్వాత ముఖ్యమంత్రిగా ఆయన పనితీరును పరిమితం చేస్తూ కోర్టు విధించిన షరతులు ఆయన రాజీనామాకు దారితీశాయి.

# ఆదివాసీ కోటలో పాగా వేసేదెవరో?

**పోలింగ్‌కు సిద్ధమైన ఝార్ఖండ్..**

అసెంబ్లీ ఎన్నికలకు ఆదివాసీ రాష్ట్రం ఝార్ఖండ్ సిద్ధమైంది. మొత్తం 81 అసెంబ్లీ స్థానాలుండగా.. మొదటి దశలో 43 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం సీట్లలో 28 ఎస్టీ, తొమ్మిది ఎస్సీ రిజర్వుడు స్థానాలే ఉన్నాయి. నవంబర్ 13న జరగనున్న తొలిదశ పోలింగ్ కోసం అధికార జేఎంఎం, బీజేపీలు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్ నుంచి చొరబాట్ల అంశం ప్రధానంగా నిలువగా.. అవినీతి, ప్రజాకర్షక హామీలు, కేంద్రం నిధుల విడుదల వంటివి కీలకాంశాలుగా నిలిచాయి.

**చొరబాట్లే కీలకం..**

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బంగ్లాదేశ్, రోహింగ్యాల చొరబాట్ల అంశాన్ని కాషాయ పార్టీ ప్రధానంగా ఎంచుకుంది. సంతాల్ పరగణాలు, కొల్హాన్ ప్రాంతాల్లో ఈ సమస్య భారీగా ఉందని.. రాష్ట్రాన్ని ధర్మసత్రంగా మారుస్తున్నారని మండిపడింది. ఓట్ల కోసమే అక్రమ చొరబాటుదారులకు కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన జేఎంఎం ప్రభుత్వం ఆశ్రయమిస్తోందని ఆరోపించింది.

అయితే, భాజపా విమర్శలను తిప్పికొట్టిన జేఎంఎం.. ఈ అంశాన్ని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేసింది. రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయడం లేదంటూ బీజేపీపై ఆరోపణలు గుప్పించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు పెట్టిందని సీఎం హేమంత్ ఆరోపించారు.

**ప్రజాకర్షక పథకాలు..**

రాష్ట్రంలో ప్రజాకర్షక పథకాలపైనా ఇరు పక్షాలు అనేక హామీలు కురిపించాయి. జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.వెయ్యి ఇచ్చే పథకాన్ని ప్రవేశపెట్టగా.. బీజేపీ కూడా అర్హులైన మహిళలకు నెలకు రూ.2100 ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది.



దీనికి కౌంటర్‌గా జేఎంఎం మరో ముందడుగు వేసి.. ఈ మొత్తాన్ని రూ.2500కు పెంచుతామని హామీ ఇవ్వడం గమనార్హం.

ఎల్పీజీ సిలిండర్ రూ.500లకే అందించడంతోపాటు ఏడాదికి రెండు ఉచితంగా ఇవ్వడం, నిరుద్యోగులకు రెండేళ్ల పాటు నెలకు రూ.2వేల చొప్పున అందిస్తామని భాజపా హామీ ఇచ్చింది. ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు, రెండున్నర లక్షలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం వంటి హామీలూ కురిపించింది.

**ప్రభుత్వంలో అవినీతి..**

హేమంత్ సోరెన్ ప్రభుత్వంపై అవినీతి కూడా ఈ ఎన్నికల్లో ప్రధానాంశంగా నిలిచింది. ఓ భూ ఒప్పందానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో హేమంత్ అరెస్టు అంశం ఎన్నికల ప్రచారంగా మారింది. జేఎంఎం అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ ఆరోపించగా.. ఆదివాసీ ముఖ్యమంత్రి లక్ష్యంగా కాషాయ పార్టీ రాజకీయాలు చేస్తోందని అధికార పార్టీ మండిపడింది.

**చంపాయీ తిరుగుబాటు..**

జైలు నుంచి విడుదలైన హేమంత్ సోరెన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తే.. చంపాయీ నుంచి ప్రమాదం పొంచి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు ముందస్తుగా అంచనా వేశారు. అందుకు తగినట్లుగానే పార్టీని వీడిన ఆయన.. బీజేపీలో చేరిపోయారు. తాజా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో చంపాయీకి ఉన్న ప్రజాదరణ వల్ల ఆ వర్గం ఓట్లు చీలిపోయే అవకాశాలున్నాయని, అది జేఎంఎ-కాంగ్రెస్ కూటమిపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఉగ్ర శ్రీనివాసుడు దర్శనమిచ్చే కైశిక ద్వాదశి

- ఈ ఒక్క రోజే సూర్యోదయానికి ముందే స్వామివారు విహరిస్తారు

అనంతశయనుడు శ్రీ మహావిష్ణువును కైశిక ద్వాదశి పర్వదినాన మేలుకొల్పుతారు. ఆషాఢ శుద్ధ ఏకాదశిన తిరువేంకటనాథుడు నిద్రకు ఉపక్రమిస్తాడు. కార్తీక మాసం శుక్ల పక్షమి ద్వాదశిని కైశిక లేక ద్వాదశిగా వ్యవహరిస్తారు. ఈ రోజున స్వామి వారిని మేలుకొల్పుతారు. తిరుమలలోని పంచబేరాల్లో ఒకరైన స్నపన బేరం ఉగ్రశ్రీనివాసుడు ఈ ఒక్కరోజే తిరుమాడవీధుల్లో భూదేవి, శ్రీదేవి సమేతంగా విహరిస్తారు. సూర్యోదయాని కన్నా ముందే ఈ కార్యక్రమం జరుగుతుంది. 14వ శతాబ్దంలో ఉగ్రశ్రీనివాసుడి ఊరేగింపు సమయంలో సూర్యకిరణాలు విగ్రహం మీద పడగానే పెద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. అందుకనే ఉగ్ర శ్రీనివాసుడిని సూర్యోదయం కన్నా ముందుగానే ఊరేగిస్తారు. ఈ ఒక్క రోజే ఉగ్ర శ్రీనివాసుడు ఆలయం నుంచి బయటకు వస్తారు.

**కైశిక మంటే?**

సంగీతంలో కైశిక అను ఒక రాగముంది. భక్తుడు ఆ పరంధాముని ఈ రాగంతో కీర్తించారు కనుకే కైశిక ద్వాదశి అని పిలుస్తారు. శ్రీనంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నాడు. మార్గమధ్యంలో బ్రహ్మరాక్షసుడు అడ్డగించాడు. తినేందుకు రాబోగా తాను స్వామివారి సన్నిధిలో గానం చేయడానికి వెళుతున్నానని చెప్పి తిరిగి వస్తానని చెప్పడంతో రాక్షసుడు అంగీకరించాడు. కోనేటిరాయుడి సన్నిధిలో కైశిక రాగంతో సంకీర్తనలను నివేదిస్తాడు. అనంతరం బ్రహ్మరాక్షసుని దగ్గరకు వస్తాడు. రాక్షసుడు ఆశ్చర్యపోయి తన పాపాలకు చింతిస్తాడు. శ్రీరంగనాథుడు రాక్షసుడికి శాప విమోచనం, భక్తుడికి మోక్షం ప్రసాదించారు.స్వామి సన్నిధిలో పరాశరభట్టు కైశిక పురాణాన్ని ఆలపించడం ప్రారంభించారు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతోంది. వరాహ పురాణంలో ఈ కైశిక పురాణాన్ని గురించి వివరించారు.



**ఆముక్తమాల్యదలో ప్రస్తావన**

కైశిక ద్వాదశి గురించి శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో ప్రస్తావించారు. బ్రహ్మరాక్షసుడు, సత్యమూర్తి గురించి సవివరంగా పేర్కొన్నారు.

## ఆక్రమణకు గురైన 34 సెంట్లు ప్రభుత్వ (స్మశానవాటిక) భూమి స్వాధీనం



విశ్వంభర, అనకాపల్లి : పరవాడ మండలం చీపురుపల్లి వెస్ట్ సర్వే నెంబర్ 398-15, ప్రభుత్వ (స్మశానవాటిక) భూమి 34సెంట్లు, ఆక్రమణకు గురైయిందని స్థానిక వైస్సార్సీపీ నాయకులు మాసవరపు అప్పారావు మండల తహసీల్దార్ కి వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఆక్రమణకు గురైన 34 సెంట్లు ప్రభుత్వ (స్మశానవాటిక) భూమిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఉన్న స్మశాన వాటికను స్తానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో చీపురుపల్లి వెస్ట్ విఆర్ ఓ హేమలత , సర్వేయర్ అనిల్ , విఆర్ ఏ లు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు



విశ్వంభర, మహబూబాబాద్ : కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాల బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం నాడు ఆటల పోటీలు ఘనంగా నోర్వహించారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ మొదలగు ఆటలు కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ ప్రారంభం చేశారు. ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు

## కుంట్లూర్‌లో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే



విశ్వంభర, పెద్ద అంబర్ పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే లో భాగంగా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్ రెడ్డి సోమవారం కుంట్లూర్ లో సర్వే జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు సర్వే సమయంలో వివరాలు పూర్తిగా వివరించాలన్నారు. ఎలాంటి అపోహలకు పోకుండా ప్రజలందరూ తమ వివరాలని వెల్లడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే చేస్తున్న సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరానీ చాయ్ బేకరీ ప్రారంభించిన సిఎల్. శ్రీనివాస్ యాదవ్




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ పట్టణంలో నూతనగా ఏర్పాటు చేసిన ఇరానీ చాయ్ శ్రీ సాయి వెంకటేశ్వర బేకరీని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ హాజరై ప్రారంభించారు. సొంతంగా స్వయం ఉపాధితో జీవితంలో పైకి రావాలని తపనతో యజమానులు శ్రీశైలం , సాయి కి శుభాకాంక్షలు తెలిపి బేకరీ మరింత అభివృద్ధి చెంది ప్రయోజకులు అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్, శ్రీశైలం యాదవ్, బాలకుమార్ గౌడ్, వడ్డే గణేష్, వడ్డే వెంకటేష్, శేఖర్ రెడ్డి, రమేష్ నాయక్, రాఘవేందర్ గౌడ్, విజయ్ యాదవ్, మహేష్, అజయ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలు పెంచాలి : మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం



విశ్వంభర, మహబూబాబాద్ : గూడూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీగలవేణి ని మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాల్లో జరగాలని, రక్తహీనత తక్కువగా ఉన్న గర్భిణీ స్త్రీలందరిని గుర్తించి, వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందించాలని, సీజనల్ గా దొరికే పండ్లను తీసుకోవాలని, ఆకుకూరలు, సమతుల్య ఆహారము తీసుకోవాలని, గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొనేలాగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చేయాలని, హాస్పిటల్లో ఉన్న రికార్డులను, ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాంబాబు, కె.వి రాజు హెల్త్ ఎడ్యుకేటర్, డాక్టర్ కిరణ్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్,హెల్త్ సూపర్ వైజర్ షాను బేగం, నర్సింగ్ ఆఫీసర్,మనోహర్,శోభ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పేటెంట్లు, కాపీరైట్ కలిగి ఉండడం ఉత్తమం

### గీతం ఆతిథ్య ఉపన్యాసంలో డాక్టర్ ఉమేష్ వి.బణాకర్ సూచన



**విశ్వంభర, సంగారెడ్డి:** ఔషధ తయారీ సంస్థలు తమ ఉత్పత్తులకు పేటెంట్లు, కాపీరైట్ లను కలిగి ఉండడం ఉత్తమమని ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విశిష్ట ఆచార్యుడు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అకాడమియాకు స్వతంత్ర సలహాదారు డాక్టర్ ఉమేష్ వి. బణాకర్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో సోమవారం ఆయన మేథో సంపత్తి హక్కులు ఐపీలో కెరీర్' అనే అంశంపై ఉదయం, విచ్ఛేద పద్ధతులు సవాళ్లు అనే అంశంపై భోజనానంతరం ఆయన ఆతిథ్య ఉపన్యాసాలు చేశారు. మేథో సంపత్తి హక్కుల ప్రాథమిక అంశాలు, వాటి రకాలు, వాటి కోసం దరఖాస్తు చేసే పద్ధతులకు డాక్టర్ ఉమేష్ వివరించారు. పేటెంట్లు, కాపీరైట్ లను కలిగి ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను కూడా విశదీకరించారు. కాపీరైట్లను ఉల్లంఘించడం, పేటెంట్ల నిబంధనలను ఉల్లఘించడం వంటి అనేక ఉదాహరణలను ఆయన ఉటంకించారు. ఈ రంగంలోని వివిధ కెరీర్ ఎంపికలపై ఫార్మసీ విద్యార్థులకు ఆయన లోతైన అవగాహన కల్పించారు. విచ్ఛేద పద్ధతులు, సవాళ్లపై మాట్లాడుతూ, రద్దు యొక్క ప్రధాన సూత్రాలను, వెంటనే విడుదల చేసిన ఔషధాలపై నిర్వహించిన రద్దు అధ్యయనాలు, వీటిని అమలు చేయడంలో పరిశోధకులు ఎదుర్కొనే సవాళ్లను డాక్టర్ ఉమేష్ విడమరచి చెప్పారు. తొలుత గీతం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ అతిథిని స్వాగతించి, పరిచయం చేశారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్. కుమార్, అతిథిని సత్కరించి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫార్మసీ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ కుంట సుందరీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సబితా



విశ్వంభర, మహేశ్వరం : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్గూడ లోని పోచమ్మ కుంట సుందరీకరణ పనులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రతి చెరువు కూడా మురికి కూపాలుగా కాకుండా మిషన్ భగీరథ ద్వారా చెరువు పూడికాలు తీసి సుందరీకరణ చేసి ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బాలాపూర్ రెవిన్యూ లో 42 చెరువులు కుంటలు ఉన్నాయని కేసీఆర్ హయాంలో ఎస్ ఎన్ డి పి నాళాల ద్వారా ఇక్కడున్న డ్రైన్ వాటర్ మొత్తాన్ని పెద్ద చెరువు చుట్టూ ఎస్ ఎన్ డి పి నాలాను ఏర్పాటుచేసి బయటకు పంపించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా చెప్పాలంటే పోచమ్మ కుంటకు గత ప్రభుత్వా హయాంలో రెండు కోట్ల రూపాయల సాంక్షన్ చేయడం జరిగిందని టెండర్ పిలిచి ఇట్టి పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.చెరువులు గుర్రపు డెక్కతో నిండి ఉండకుండా కచ్చితంగా ప్రతి చెరువులు కూడా బ్యూటిఫికేషన్ చేయాలి. ఒక మహేశ్వరం నియోజకవర్గంలోని 11 చెరువులను బ్యూటిఫికేషన్ చేయడం జరిగిందని, చెరువుల సుందరీకరణకు గత ప్రభుత్వ హయాంలో 40 కోట్ల రూపాయలతో సుందరీకరణ పనులు చేయడం జరిగిందని కొన్ని జరుగుతున్నాయి కొన్ని పూర్తి అయినవి దానికి సహకరించాలని రాజకీయ కోణంతో చూడకుండా ప్రజల అవసరాలు తీర్చే విధానానికి తోడ్పడాలని ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాకుండా హెచ్ఎండిఏ పరిధిలో ఉన్న చెరువులో గుర్రపు డెక్కన్ తొలగించాలి అంటే అధికారుల అనుమతి అవసరం లేదని హెచ్ఎండిఏ వారి బాధ్యతగా భావించి గుర్రపు డెక్కన్ తొలగించాలని సబితా ఇంద్రా రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి బిడ్డలకు పెద్దన్నగా ఎమ్మెల్యే మందుల సామేల్

### రూ. లక్ష ఆర్థిక సాయం



**విశ్వంభర , హైద్రాబాద్ :** విద్య, వైద్యం విషయంలో సమస్య ఏదైనా తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడంలో ముందుంటున్నాడు ఎమ్మెల్యే మందుల సామెల్. మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల మహేశ్వరి అనే నిరుపేద దళిత బిడ్డ ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించింది. డాక్టర్ కావాలనే కోరికతో మొదటి ప్రయత్నంలోనే నీట్ లో ప్రతిభ కనబరిచి కామినేని దంత వైద్య కళాశాలలో బిడిఎస్ సీటు సాధించారు. కానీ కాలేజీ ఫీజు కట్టలేని ఆ నిరుపేద బిడ్డ కు ఆర్థిక సమస్యలు గుదిబండగా మారడంతో సీటు వదులుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ పట్టు వదలక, చదువుపై ఉన్న మమకారం చంపుకోలేక ఎంసెట్ పరీక్ష రాయడంతో ఈ సంవత్సరం హైదరాబాదులోని ఆర్టికల్చర్ కళాశాలలో సీటు వచ్చింది. ఫీజులకు ఆర్థిక సమస్యలు ఎదురవడంతో పాటు తండ్రి పెరాలసిస్ బాధితుడు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నిరుపేద విద్యార్థిని పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ దృష్టికి తీసుకువెళ్లగా మహేశ్వరి చదువు అండగా నిలిచారు. ఆమె తల్లిదండ్రులను హైదరాబాద్ కు పిలిపించి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామెల్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే అవకాశాలతో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని తుంగతుర్తి ఎమ్మెల్యే చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు సగ్గం నరసయ్య, తదితరులు ఉన్నారు.

## డీసీసీబీలకు నాబార్డు ద్వారా ఇచ్చే రాయితీ రుణాలను సద్వినియోగపరుచుకోవాలి

### - జాతీయ నాబార్డ్ అభివృద్ధి అధికారి భూపేందర్ సింగ్, ఉడిత్ అగర్వాల్



విశ్వంభర, ఆమనగల్లు : జిల్లా సహకార బ్యాంకులకు నాబార్డు ద్వారా ఇచ్చే రుణాల రాయితీలను రైతన్నలు సద్వినియోగపరచుకొని అభివృద్ధి చెందాలని జాతీయ నాబార్డు డెవలప్మెంట్ అధికారులు భూపేందర్ సింగ్, ఉడిత్ అగర్వాల్ అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో సెంట్రల్ బోర్డ్ టీం ఆధ్వర్యంలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన డిసిసిబి చైర్మన్లు డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ఆమనగల్లు పిఎసిఎస్ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాలు తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరయ్యారు. బ్యాంకర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ వారి ఆహ్వానం మేరకు నాబార్డ్ ఆధ్వర్యంలో డిసిసిబి చైర్మన్లు , డైరెక్టర్లు హాజరయ్యారు. గతంలో మహబూబ్నగర్ జిల్లా సహకార బ్యాంకు నుంచి కొత్తగా కడ్తాల్, అమ్రాబాద్, తెలకపల్లి, ధారూరు నాలుగు డిసిసిబి బ్యాంకులను ఆర్బిఐ ఆదేశానుసారం ప్రపోజల్ పంపించడం జరిగిందని దీనికిగాను ఆర్బిఐ నుంచి నాబార్డు ద్వారా నాలుగు డిసిసిబి బ్యాంకులకు అప్రూవల్ రావడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ నాబార్డు డెవలప్మెంట్ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ సెక్టార్ కు నాబార్డ్ ఇచ్చే వ్యవసాయ రుణాల రాయితీలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులను కలిసి నేరుగా అవగాహన కల్పించాలని సూచించారు.

## నకిలీ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి



విశ్వంభర, మహబూబాబాద్ : జిల్లాలో ఇటీవల కొంతమంది కనీసం సంస్థ ఐడీ కార్డు, అక్రిడిటేషన్ లేకుండా వాహనాలపై ప్రెస్ స్టికర్లు అంటించుకొని, ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చిందని సోషల్ మీడియా వేదికగా అనేక గ్రూప్ లు ఏర్పాటు చేసి అందులో కూడా వర్కింగ్ జర్నలిస్టులను భాగస్వామ్యం చేసి ఇక్కడ జర్నలిస్టులే లేని, ప్రచురితం కాని, ఆన్లైన్ పత్రికలకు అధికారులపై తప్పుడు సమాచారం ఇస్తూ స్వప్రయోజనాల కోసం జిల్లా అధికారులను,మండల స్థాయి, గ్రామ స్థాయి వరకూ ఎవరినీ వదలకుండా ఆర్థికంగా, సామాజికంగా బ్లాక్ మెయిల్ చేస్తూ గ్రూప్ లలో తప్పుడు ప్రచారం చేస్తూ ఏదోఒక విధంగా లబ్ది పొందుతూ జర్నలిస్టు విలువలను దిగజార్చుతూ పబ్బం గడుపుతున్న కొంతమంది నఖిలీలపై వారి క్రిమినల్ నేపథ్యంపై పూర్తి వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ కలిసి వినతిపత్రం అందించారు జిల్లా జర్నలిస్టులు.

## పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే సబితా



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువులో చేప పిల్లలను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్, జులై నెలలో పంపిణీ చెయ్యవలసిన చేపపిల్లలు ప్రభుత్వం 5 నెలల తర్వాత ఇవ్వడం వల్ల చేపలలో ఎదుగుదల ఉండదని, ప్రతి సంవత్సరం 5 లక్షలకు పైగా చేపపిల్లలు ఇచ్చేవాళ్ళం అని అన్నారు. ఈ సంవత్సరం మాత్రం సగం చేపపిల్లలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. దీనివల్ల మత్స్యకారులకు గంగపుత్రులకు పెద్దగా ఉపయోగం లేదని ఉన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ కలెక్టర్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం : టీఎన్జీవో కేంద్ర సంఘం

**విశ్వంభర, హైదరాబాద్ :** విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పై కొంతమంది రైతుల పేరు మీద జరిపిన దాడికి , కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మీద జరిగిన దాడిని తెలంగాణ ఎన్జీవోల సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నామని ఎన్జీవో ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. హుస్సేని ముజీబ్ లు ఓ ప్రకటనలో తెలిపారు. నిరసనగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 12 తేదిన జిల్లా ఉద్యోగులందరూ తెలంగాణ ఎన్జీవోల సంఘం నాయకత్వంలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు అయ్యి నిరసన చేపడతారని అని తెలిపారు. దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్షలు విధించాలని జిల్లా అత్యున్నత అధికారైన కలెక్టర్ ప్రతీక్ మీద జరిగిన దాడి పట్ల ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటదని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించుకునే మార్గం ఉన్నదని అంతే గాని చట్టాన్ని తమ చేతిలో తీసుకొని అధికారుల మీద దాడులు చేయడం హేయమైన చర్యని అని తెలిపారు.

## దేవాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఎన్నారం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామంజనేయ స్వామి దేవాలయ పునఃనిర్మాణ పనులకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో జ్ఞానజ్యోతి విద్యా సంస్థల చైర్మన్ నల్ల భాస్కర్ రెడ్డి, శరణ్య రెడ్డి, శ్రీ ఆంజనేయ స్వామి గుడి చైర్మన్ ఏనుగు దామోదర్ రెడ్డి, మాజీ ఎంపిపి, కక్కిరేని యెల్లమ్మ విజయ్, గంగుల వెంకట రాజిరెడ్డి, నల్ల భాస్కర్ రెడ్డి, శరణ్య రెడ్డి, జినుకల ప్రభాకర్, సభ్యులు లోడంగి సురేష్, సింగారపు నరసింహ, బండమీది స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి



విశ్వంభర, మహేశ్వరం : బడంగ్ పేట్ మున్సిపాలిటీ లోని 26 వ డివిజన్, 3వ డివిజన్ లో డ్రైనేజ్ సీసీ రోడ్ పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి , కార్పొరేటర్లు రామిడి మాధురి, రామిడి కవిత తోపాటు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎదుల్ల ప్రతాప్ రెడ్డి, కళ్ళు సురేందర్ రెడ్డి, వినోద్ నాయక్, వెంకటేష్ గౌడ్, క్రిష్ణ యాదవ్, శేఖర్, ఐలమ్మ, యాదవ్, లక్ష్మారెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజావాణిలో వచ్చిన సమస్యల దరఖాస్తులు పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో సమస్య పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులు ఎండార్స్మెంట్ చేశామని తెలిపారు.

## మందుల కొరత లేకుండా చూడండి :హెల్త్ డైరెక్టర్



విశ్వంభర, మహబూబాబాద్: సోమవారం తెలంగాణ మెడికల్ సర్వీస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సవ్ తో కలిసి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిని సందర్శించి రాష్ట్ర కార్యాలయం నుంచి మందుల సరఫరా ఏ విధంగా ఉందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి మందుల సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూస్తుందని కావున తమ తమ ఆసుపత్రులలోని స్టాకును పరిశీలించి ఆన్లైన్ ద్వారా స్టాక్ ఇండెంట్ ని సమర్పించినట్లయితే అట్టి మందులను సరఫరా చేయనున్నట్లు, అంతేకాకుండా ఇప్పటివరకు ఈ- ఔషధీ పోర్టల్ లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ తగిన సూచనలను జారీ చేశారు.

## షాద్ నగర్ పట్టణంలో ఘనంగా యాదవ్ సమ్మేళనం సంబరాలు

### పాల్గొన్న మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



విశ్వంభర , షాద్ నగర్ : షాద్ నగర్ పట్టణంలో ఆదివారం యాదవ సోదరులు సదర్ సమ్మేళనాన్ని ధూమ్ ధామ్ గా నిర్వహించారు. యాదవ సదర్ సమ్మేళన కమిటీ ఆహ్వానించిన విధంగానే అన్ని పార్టీల నాయకులు హాజరయ్యి వేదికను అలంకరించారు. ఈ కార్యక్రమంలో అందరూ నాయకులతో పాటుగా కేశంపేట మండల మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరయ్యారు. ఆమెను యాదవ సదర్ సమ్మేళనం కమిటీ ఘనంగా సత్కరించి వేదిక అలకరింపజేశారు. యాదవ సదర్ సమ్మేళన సందర్భంగా విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ యాదవ సోదరులుసదర్ సమ్మేళ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని, సదర్ సమ్మేళనంతో యాదవుల ఐక్యత బలపడుతుందని అన్నారు.

## యువత స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి



విశ్వంభర, కడ్తాల్ : కడ్తాల్ మండలం రాంనుంతల గేట్ దగ్గర టీ కనెక్ట్ టీ స్టాల్ ను కడ్తాల్ మండల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి అనురాధ పత్య నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు ఎవరిపై ఆధారపడకుండా తనకు తాను ఉపాధిని సృష్టించుకుని స్వయంగా ముందుకు సాగాలని స్వయంకృషితో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరయ్య, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీలు సరిత పంతు కుమార్, సర్పంచులు సోనా శ్రీను, రాములు నాయక్, పూజ, దేవానాయక్ స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

## మంగళవారం నుండి బస్ సర్వీస్ ప్రారంభం : డీఎం



విశ్వంభర, మహబూబాబాద్ బీ ఇటీవల వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మహబూబాబాద్ నుండి సూర్యాపేటకు వెళ్ళు రూట్ లో పురుషోత్తమాయ గూడెం వద్ద ఆకేరు వాగుపై బ్రిడ్జి వద్ద రహదారి డామేజ్ అవుట వలన సూర్యాపేటకు వయా ధర్మారం పురుషోత్తమయి గూడెం మీదుగా బస్సులు నిలిపివేయబడినవి. డిపో మేనేజర్ శివప్రసాద్ , డిప్యూటీ సూపర్డెంట్ శ్రీనివాస్ , వెంకన్న, సేఫ్టీ వార్డెన్ నరసయ్య వారి బృందం ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు ద్వారా బస్సులను నడుపుట మరిపెడ పోలీస్ శాఖ వారి సహకారంతో పరిశీలించటం జరిగింది. మహబూబాబాద్ నుండి సూర్యాపేటకు వయా ధర్మారం, మరిపెడ బంగ్లా మీదుగా సూర్యాపేటకు బస్సులు పునః ప్రారంభించబడనని తెలిపారు.

### అభివృద్ధిలో భూపాలపల్లి జిల్లా

# దేశానికే రోల్ మోడల్

విశ్వంభర, భూపాలపల్లి : అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు, నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో యాస్పిరేషన్ లక్ష్యాల సాధనపై విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా అభివృద్ధిలో అగ్రగామగా నిలిచి దేశానికి రోల్ మోడల్ గా ఉండాలని ఆయన సూచించారు. పారామీటర్స్ పై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలకు ఏం కావాలో అధికారులకు సంపూర్ణమైనటువంటి



అవగాహన ఉండాలని అట్టి నివేదికలను తనకు అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి గర్భిణీ ఆరోగ్యంగా ఉండాలని గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుండే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాలకు టెలికాం సేవలు

విశ్వంభర, భూపాలపల్లి : మారుమూల గ్రామాలకు సైతం టెలికాం సేవలు అందుంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు టెలి కమ్యూనికేషన్ జాయింట్ కంట్రోలర్ సీఎం సంపర్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో టెలికమ్యూనికేషన్ సేవలపై బిఎస్ఎన్ఎల్, టి ఫైబర్, ఎయిర్ టెల్, జియా సంస్థల అధికారులతో సమావేశం నిర్వహించారు. బిఎస్ ఎన్ ఎల్, టి ఫైబర్, ఎయిర్ టెల్, జియా సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని టెలికమ్యూనికేషన్ పరిస్థితులను పరిశీలించేందుకు టెలికమ్యూనికేషన్స్ శాఖ అధికారులు ఆకాంక్షిత్మ జిల్లాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యాప్తంగా టెలి కం సేవల ప్రగతిని పరిశీలించి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 189 గ్రామ పంచాయతీల్లో టి ఫైబర్ సేవలు



అందుబాటులో ఉన్నాయని, మిగిలిన గ్రామ పంచాయతీలకు టి ఫైబర్ సేవలు అందుబాటులోకి తేవడానికి అటవీ అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు. టి ఫైబర్ సేవలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందించడానికి 1844 కిమి మేర ఆప్టికల్ ఫైబర్ లైన్ వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1670 కిమి పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఓ బాబూరావు, బిఎస్ఎన్ఎల్, టి ఫైబర్, ఎయిర్ టెల్, జియా తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**విశ్వంభర, భూపాలపల్లి :** భారతరత్న పురస్కార గ్రహీత, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలను భూపాలపల్లి జిల్లా బిసి వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి, పరిపాలన దక్షకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహస్తున్నట్లు తెలిపారు. 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా



దేశ ప్రజలకు ఆజాద్ ఎనలేని సేవలు అందించారని ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, బిసి సంక్షేమ అధికారి శైలజ, జిల్లా అధికారులు, మైనార్టీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలి


విశ్వంభర, భూపాలపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఏసిఎస్, ఐకెపికి కేటాయించిన అన్ని సెంటర్లను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో సన్న, దొడ్డు



రకం ధాన్యాన్ని సూచించే విధంగా అలాగే విడి విడిగా కేంద్రాలు ఏర్పాటుతో పాటు గుర్తించడానికి వీలుగా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్యాబ్‌లలో వివరాలు నమోదులు చేయాలని డిఎంను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాములు, జిల్లా సహకార అధికారి వాలియా నాయక్, ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశ్వంభర, తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని పడకల్, వెల్జాల్ గ్రామాల్లోని పిఏసిఎస్ సెంటర్లో నెలకొల్పిన వడ్ల కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని కెసిఆర్ పాలమూరు జిల్లాలో పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి కురుమూర్తి పర్యటనలో పాలమూరు జిల్లా కు నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారని అన్నారు రైతులు వడ్లను ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని 2300 రూపాయలు చెల్లిస్తున్నారని అదనంగా 500 బోనస్ కూడా



వస్తుందని బయట వ్యక్తులకు అమ్మి మోసపోకూడదని అన్నారు. నియోజకవర్గంలోని రైతుల కరెంటు అవసరాల కోసం 24 కోట్ల నిధులు మంజూరు అయ్యేలా సీఎండి తో మాట్లాడి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ద్వారా త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సెల్ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రైతన్నలందరూ పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలపాలి : కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



విశ్వంభర, జగిత్యాల : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి జగిత్యాల జిల్లా కేంద్రం వరకు రైతన్నల రెండు లక్షల రుణమాఫీ, రైతన్నకి పెట్టుబడి సహాయం, రైతు భరోసా, పండించిన వరికి మద్దతు ధరతో పాటు బోనస్, ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని కోరుతూ మంగళవారం జరగబోయే పాదయాత్రకు పార్టీల కతీతంగా రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రైతన్నలను కోరారు. ఇట్టి పాదయాత్రలో హరీష్ రావు, కేటీఆర్ రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి రైతన్నలకు భరోసా కల్పించడానికి చల్ గల్ నుండి జగిత్యాల వరకు పాదయాత్ర లో పాల్గొంటారని రైతు సంఘం నాయకులు రైతు గ్రామ సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## జావెలిన్ త్రోలో అఖిలకు స్వర్ణం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్అథెటిక్స్ ఛాంపియన్ షిప్ ఫర్ మెన్, ఉమెన్24 - 5 పోటీలలో కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో డిగ్రీ చదువుతున్న కుర్ర అఖిల జావలిన్ త్రో 36 మీటర్లు పందెంలో స్వర్ణ పథకం సాధించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పి.రామ్ రెడ్డి తెలిపారు. శనివారం విజయలక్ష్మిని డాక్టర్ పి రామ్ రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అఖిల దేశం తరపున ఆడాలని ఆకాంక్షించారు. తమ కళాశాలలో చదువుతోపాటు విద్యార్థులకు వారి నైపుణ్యాలను వెలికి తీసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు

## పత్తి రైతును నిలువునా ముంచుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



విశ్వంభర, నర్సంపేట : సీసీఐ కావాలనే రైతుల నుండి పత్తి కొనుగోలు చేయడం లేదని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొనుగోలు కేంద్రాల వద్ద ఫోటోలకు ఫోజులిస్తున్నారు తప్ప ధరల మీద సమీక్ష చేయడం లేదని, పత్తి రైతులను పట్టించుకోవడం లేదంటూ బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. కానీ అధికార పార్టీ ఎమ్మెల్యే కానీ జిల్లా మంత్రులు కానీ ముఖ్యమంత్రి కానీ ఎక్కడ కూడా పత్తి రైతుల సమస్య మీద సమీక్ష సమావేశం నిర్వహించకపోవడం దుర్మార్గం అని అన్నారు.

## ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండలంలో ఎన్నిమరేషన్ విధుల గైర్హాజరీ కి సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా షో కాజ్ నోటీసులు ఉపాధ్యాయులు అందుకున్నారు. మండల శాఖ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారిని, మండల విద్యాధికారిని కలిసి వివరణ తెలియజేసి షోకాజ్ నోటీసులను తొలగించాలని మండల శాఖ అధ్యక్షులు జానకిరామ్ నాయక్, అధ్యక్షులు ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శి జంగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ మాజీ అధ్యక్షులు కన్నయ్య గోవర్ధన్ యాదవ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అందరూ వెళ్లి అధికారులకు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ డీఈఓ తో మాట్లాడి, ఇచ్చిన షోకాజు నోటీసులను తొలగింపజేస్తామని అన్నారు.

## కమ్యూనిటీ హాల్ కోసం కలెక్టర్‌కి వినతి పత్రం



విశ్వంభర, భూపాలపల్లి : తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్ ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గౌడ కులస్తులకు ఇచ్చిన 30 గుంటల భూమిలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని తెలంగాణ గౌడ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు ఏరుకొండ సంపత్ కుమార్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండపాక సాంబయ్య గౌడ్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రామచంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశ్వంభర, మహేశ్వరం : మండలం కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర స్వామి టెంపుల్ లో కార్తీక సోమవారం ఉండడంతో అధిక సంఖ్యలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అర్చన, అభిషేకలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, వివిధ గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు

## నారాయణపూర్ మండల ఎంజెఎఫ్ కమిటీ ఎన్నిక

-అధ్యక్షుడిగా చింతకింది సుధాకర్



**విశ్వంభర,సంస్థాన్ నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపూర్ మండల మాదిగ జర్నలిస్టు ఫోరం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షునిగా చింతకింది సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సిరిపంగి బాలరాజు, ఉపాధ్యక్షుడిగా ఉప్పలపల్లి బాలు, గౌరవాధ్యక్షునిగా వలిగొండ యాదయ్య, సహాయ కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా కురుమతి రమేష్ లను ఎన్నుకున్నారు. మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు జీడిమెట్ల రవీందర్ హాజరై నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కలకొండ సంజీవ, రేవనపల్లి బుగ్గరాములు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల
# నిర్మాణ దాతలకు వీర్లపల్లి శంకర్ సన్మానం

విశ్వంభర, షాద్‌నగర్ : షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశయాలకు అనుగుణంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతలు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని విరాళాల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విరాళాలు అందించిన దాతలకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ సంకల్పానికి దాతలు ముందుకు వచ్చి చేయూతనివ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ దాతలు



కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ నాయకుడు, పట్టణ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి 1,11,111 రూపాయలు, దండు బ్రదర్స్ అయినా దండు శరత్ బాబు మరియు వాసులు 5 లక్షల రూపాయలు, రిటైర్డ్ టీచర్ మరియు మాజీ ఎంపిటిసి వాడ్యాల నరసింహారెడ్డి 75,000 రూపాయలు, సయ్యద్ సాదిక్ 2,22,222 రూపాయలు, కాంగ్రెస్ మైనారిటీ నేత ఎండి ఇబ్రహీం 1,16,000 రూపాయలు చెల్లించిన వారిలో ఉన్నారు.

## తల్లీకూతుళ్లకు భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



**విశ్వంభర, బషీర్ బాగ్:** రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో తల్లీ, కూతురు నర్తకీమని హైకోర్టు న్యాయవాది దువ్వూరి వాస్తల్యేంద్ర, మిస్సెస్ యూనివర్స్ ఇంటలిజెన్స్ నర్తకీమని అభిమాణికా యాదవ్ లు కలిసి నారీ శక్తి నాట్య హేళ లో 90 నిముషాల పాటు నవజనార్ధన పారిజాతం, పేరిణి తాండవం చేసి తమ పేర్లని భారత్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు చేసుకున్నారు. శ్రీకృష్ణుడు, శివుడి ప్రత్యేక పాత్రలో డాక్టర్ కాంతిలాల్ జైన్ అలరించారు.ముఖ్య అతిధి సముద్రాల వేణుగోపాలాచారి, భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు, ఏ. శ్రీధర్, ప్రముఖ నాట్యాగురువు పేరిణి కుమార్, డాక్టర్ కాంతిలాల్ జైన్ ప్రముఖ ఆర్తో పెడిక్ సీనియర్ సర్జన్ ల చేతుల మీదుగా తల్లి వత్సలెంద్ర, కుమార్తె అభిమానిక నారీ శక్తి నాట్య హేళ భారత్ వరల్డ్ రికార్డ్స్ ను అందజేశారు.

## సమగ్ర సర్వేపై పట్టణ ప్రజలకు అపోహలు వద్దు



విశ్వంభర, ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీలో అన్ని బ్లాకుల్లోని ఎన్యుమరేటర్స్ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మున్సిపాలిటీ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సర్వేకు ప్రభుత్వానికి సహకరించాలని ఎటువంటి అపోహలకు తావులేదని తమ న్యాయం కోసం ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందని అన్నారు. ఎన్యుమరేటర్స్ సమగ్రంగా ఫారం లోని జాబితా పరిశీలించి తప్పులు లేకుండా నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

విశ్వంభర, పెద్ద శంకరంపేట : తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని గతంలో ఎన్నడు లేని విధంగా క్రీడలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 364 కోట్ల రూపాయలను క్రీడ శాఖకు కేటాయించారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు మండల పరిధిలోని జూకల్ శివారులో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లో ఈరోజు 6%ష్ట్ర% జోన్ 10%ష్ట్ర% జోనల్ మీట్ అండర్ 14 అండర్ 17 అండర్ 19 బాయ్స్ పోటీలను నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు ముఖ్యమంత్రి చరిత్రలో ఎన్నడు లేని విధంగా 364 కోట్ల రూపాయలు నిధులను క్రీడా శాఖకు కేటాయించారని జిల్లాకు స్పోర్ట్ యూనివర్సిటీ నియోజకవర్గం లో ఇండోర్ స్టేడియం నెలకొల్పాలని ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు సంగారెడ్డి



జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శేట్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, రమేష్ చౌహాన్, శంకర్ ముదిరాజ్, పల్లవి పరశురాం మరియు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



విశ్వంభర, మహబూబాబాద్ : భారతరత్న పురస్కార గ్రహీత, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబ్దుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన వ్యక్తి, పరిపాలన దక్షకుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని అన్నారు. 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధికే కుటుంబ సర్వే



విశ్వంభర, పెద్ద శంకరంపేట: సమగ్ర అభివృద్ధికి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ ఇతర అంశాలకు సమగ్ర కుటుంబ సర్వే ఎంతగానో దోహదపడుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.. సోమవారం పెద్దశంకరపేటలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రగతి ప్రణాళికల రూపకల్పనకు జరుగుతున్న సర్వేలో ఎన్యూమారెటర్లు సేకరించిన డేటా ఎంట్రీ వివరాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు.. సర్వే మెటీరియల్ పటిష్ట భద్రతకై ట్రంకు పెట్టెలో భద్రపరచాలని ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి పొరపాటుకు తావు లేకుండా కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ ఎన్యు మేటర్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పేట తాసిల్దార్ గ్రేసీ బాయ్ ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా డిటి శ్రీనివాస్ ఈవో వెంకట రాములు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే
# భవిష్యత్ తరాలు బాగుంటాయి

విశ్వంభర, కడ్తాల్ : గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పత్రీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన కడ్తాల్ మండల కేంద్రంలోని మహేశ్వర మహా పిరమిడ్ ఆవరణలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పత్తి రవికుమార్, చంద్రశేఖర్, నిర్మల మాధవి గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఆర్డినేటర్ సతీష్ లతో కలిసి రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పత్రీజీ శక్తి స్థల్ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ట్రస్టీ సభ్యులు మరియు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలనే సంకల్పంతో మొదలుపెట్టిన ఈ కార్యక్రమం భావితరాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని



మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని అన్నారు పత్రీజీ గారి జన్మదిన పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా అందని అన్నారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ కులాల రైతులకు
## జేజిఎల్ 24423 రకం విత్తనాల అందజేత




విశ్వంభర, త్రిపురారం : త్రిపురారం మండల కేంద్రంలో కంపాసాగర్ నందుగల కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు కావలసిన సమగ్ర వ్యవసాయ పరిజ్ఞానాన్ని, నూతనవంగడాల రూపకల్పన వాటి అభివృద్ధి వాటి సస్యరక్షణ చర్యలను నివృత్తి చేస్తూ వ్యవసాయ రంగంలో రైతులను అభివృద్ధి పదంలో నిలబెట్టడానికి కృషివిజ్ఞాన కేంద్రం ప్రముఖ పాత్ర పోషిస్తుంది.. ఈ క్రమంలో భాగంగా సోమవారం రోజు కృషి విజ్ఞాన కేంద్రం, కంపసాగర్ నందు షెడ్యూల్ కులాల రైతులకు జేజిఎల్ 24423 వరి రక%శీ% విత్తనాలను రైతులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. శ్రీనివాస రావు జేజిఎల్ 24423 వంగడం లక్షనాలను, కలుపు నివారణ , చీడ పీడల పై అవగాహన కల్పించారు.

## క్షుద్ర పూజల కలకలం



విశ్వంభర, భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామ సమీపంలోని వాగు వద్ద కొంతమంది వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహిస్తుండగా గ్రామస్తులు గమనించి అక్కడకు వెళ్లడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. ఒక్కరిని స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. నల్ల కోడి, గుమ్మడికాయలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు ముగ్గులు వేసి పూజలు జరిపినట్టు స్థానికులు చెబుతున్నారు. కుదురుపల్లి వాగు వద్ద క్షుద్ర పూజలు చేయించుకున్న ఐదుగురు వ్యక్తులను మహదేవపూర్ ఎస్సై కే. పవన్ కుమార్ మహదేవపూర్ ఎం ఆర్ ఓ ముందు బైండ్ ఓవర్ చేశారు. పూజ చేసిన వ్యక్తి పరారీలో ఉన్నాడు అని మహదేవపూర్ ఎస్సై తెలిపారు.

## ఉయ్యూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం




విశ్వంభర, అయ్యేరు : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భముగా జాతీయ విద్యా దినోత్సవం వేడుకను లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నేరెళ్ళ తేజ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లయన్ హాసన్ అహ్మద్ హాజరయ్యారు. లయన్స్ ప్రతినిధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్ పర్సన్ యం.డి.ఇస్మాయిల్, ఉర్దూ స్కూల్ హెచ్.యం. ఎస్. కె, ఉయ్యూరు లయన్స్ క్లబ్ సెక్రటరి నెల్లి రాంబాబు, లయన్స్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, పూర కిశోర్ కుమార్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వికారాబాద్ కలెక్టర్ మీద జరిగిన
## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

టిజిటిఎ రాష్ట్ర నాయకులు ఇక్బాల్, బండి నాగేశ్వర్ రావు కే విక్రమ్ కుమార్



విశ్వంభర, హైద్రాబాద్ : విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ని కొంతమంది రైతుల పేరు మీద జరిపిన దాడికి కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ యొక్క ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మీద జరిగిన దాడిని టిజిటిఎ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి నిరసనగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా రేపు మంగళవారం 12 .11. 2024 నాడు జిల్లా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు అయ్యి నిరసనచేపడతారని అదే విధంగా దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్షలు విధించాలని జిల్లా అత్యున్నత అధికారి అయిన కలెక్టర్ మీద జరిగిన దాడి పట్ల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని
## పరిశీలించిన డిస్ట్రిక్ కోపరేటివ్ ఆఫీసర్

విశ్వంభర, త్రిపురారం : సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్ పత్యానాయక్ అసిస్టెంట్ రిజిస్టర్ ఎం మురళీలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చేటప్పుడు 17% మేటర్ ఉండేవిధంగా చూసుకొని



తీసుకురావాలని కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసినప్పుడు ఆధార్ కార్డు బ్యాంకు ఎకౌంటు పొలం పుస్తకం ఫోన్ నెంబర్ ఇవ్వాలని ఐదు రోజులలో అకౌంట్లో డబ్బులు జమవుతాయని ఒక్క గంట తర్వాత బోనస్ 500 కూడా జమ అవుతాయని అన్నారు. దళారుల చేతుల్లో మోసపోకుండా రైతులంతా ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. వారి వెంట చైర్మన్ జయరాం నాయక్ డైరెక్టర్లు సైదులు గాసిరాం సిబ్బంది సైదయ్య రైతులు ఉన్నారు.

## షాద్ నగర్‌లో ధూం ధాంగా సదర్ సమ్మేళనం



విశ్వంభర, షాద్ నగర్ : రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలో యాదవలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ సమ్మేళన్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ సదర్ సమ్మేళన్ వేడుకను ఉద్దేశించి మాట్లాడుతూ సదర్ పండుగ అంటే హైదరాబాద్ గా పేరుగాంచిన వేడుక అని, కానీ ఇప్పుడు షాద్ నగర్ లో నిర్వహించడం పట్ల నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

# ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

విశ్వంభర, పెద్ద శంకరం పేట: పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన జంగం చింటూ (25) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మ హత్య చేసుకున్నాడనీ స్థానిక ఎస్ ఐ శంకర్ తెలిపారు. ఈ మేరకు అతని బార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. శిరీష, ఎస్ ఐ శంకర్ లు తెలిపిన వివరాల మేరకు తన జంగం చింటూ, వాళ్ల రెండు సంవత్సరాల కొడుకు, బార్య తో కలిసి బీరం గూడలో ఉంటూ కూలి పని చేసుకుంటూ బతుకుతున్నారని చెప్పారు. గత కొద్దిరోజుల క్రితం ఆమె కాన్పు సమయం లో ఆరోగ్యం బాలేక ఖర్చుల కోసం బంధువుల దగ్గర నాలుగు లక్షల రూపాయలు అప్పు చేసారని, కూలి పనులతో వచ్చే డబ్బులను అప్పు కట్టడం తీరలేదంటూ తన భర్త తనతో చెప్పుకొని బాధపడేవాడని శిరీష తెలిపింది.



ఆదివారం నాడు మధ్యాహ్నం వాళ్ళ బంధువుల పెళ్లి అయి పోయిన తర్వాత సర్వే నడుస్తుందని తనని తన కొడుకుని ఇక్కడే ఉండాలని చెప్పి, సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటి నుంచి బయలు దేరి వెళ్లాడని ఆమె తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు వాళ్ల బంధువైన జంగం సతీష్ తనకి ఫోన్ చేసి శంకరంపేట ఊరి శివారులో గల తిరుమలా పూర్ చెరువులో తన భర్త దూకి మునిగి పోతు న్నాడని తనకు ఫోన్ చేయగా వెళ్లి, తన కుటుంబ సభ్యులతో చూసే సరికి తన భర్త మృత దేహం దొరక లేదని అన్నారు. సోమవారం ఉదయం గజ ఈత గాళ్ల సాయంతో వెతకగా ఉదయం 8 గంటలకు తన భర్త మృత దేహం దొరికిందని అన్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల తన భర్త చెరువు లో దూకి చని పోయినాడని దరఖాస్తు ఇవ్వగా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ శంకర్ వివరించారు.

## రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్



విశ్వంభర, మిర్యాలగూడ : ధాన్యం కు మద్దతు ధర చెల్లించడం లేదని అద్దంకి నార్కట్ పల్లి రహదారిపై రైతులు రాస్తారోకో చేయడంతో రైస్ మిల్లును అధికారులు తనిఖీ చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలో ఉన్న మహర్షి రైస్ మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. సోమవారం అడిషనల్ జిల్లా కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మహర్షి రైస్ మిల్లును తనిఖీ చేశారు. రైతుల మద్దతు ధర ఇవ్వక పోవడంతో ఆందోళనల నేపథ్యంలో ఈ తనిఖీ కొనసాగింది. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ మద్దతు ధర చెల్లించని రైస్ మిల్లులను సీజ్ చేస్తామన్నారు. రైతుల ఫిర్యాదు పై మహర్షి రైస్ మిల్లుకు నోటీస్ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 82 సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

## నష్టపోయాం.. ఆదుకోండి

### - సీఎంకి ఈజీఎంఎం కాంట్రాక్టు ఉద్యోగుల వినతి



విశ్వంభర, హైదరాబాద్ : ఉద్యోగ భద్రత, పదోన్నతులు కల్పించాలని ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ఈజీఎంఎం కాంట్రాక్టు ఉద్యోగులు శ్రీనివాస్, రాజమౌళి, సాయికిరణ్, కిరణ్, బాల్రాజ్ తది తరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. హెచ్ఆర్ విధానం, సరైన జీతభత్యా లు, పదోన్నతులు లేక తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ యువకిరణాలు, రాజీవ్ ఉద్యోగశ్రీ అమలు చేసిన ఈజీఎంఎం ఉద్యోగులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తీవ్రంగా నష్టపోయామని వివరించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలైన రాజీవ్ యువ కిరణాలు, రాజీవ్ ఉద్యోగ శ్రీ అమలు పరిచిన ఉద్యోగులు, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంతో తీవ్రంగా నష్టపోయామని ఈ ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యోగ భద్రత, పదోన్నతులు కల్పించాలని ముఖ్యమంత్రి కి వేడుకోన్నారు.

## ఘనంగా గోదావరికి హారతి



విశ్వంభర, భూపాలపల్లి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశముల ప్రకారం కార్తీక మాసం ప్రతి సోమవారం రాష్ట్రంలోని ప్రముఖ నది తీరాలలో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన రాజ గోపురం నుండి మంగళ వాయిద్యాలతో గోదావరి నది వద్దకు బయలుదేరి ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు గోదావరి నది హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఏ మారుతి , సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..

### అధిష్ఠానం నేతలతో భేటీ?



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆయన బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ ఏఐసీసీ పెద్దలతో ఆయన సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను ఏఐసీసీ ముఖ్య నేతలకు సీఎం రేవంత్ వివరించనున్నట్లు సమాచారం.

## పోలీసు కార్యాలయం ఎదుట యువతి ఆత్మహత్యాయత్నం

విశ్వంభర, ఒంగోలు: ఒంగోలు పోలీసు కార్యాలయం ఎదుట ఒడిశాకు చెందిన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. అప్రమత్తమైన పోలీసులు మంటలు ఆర్పివేసి.. ఆమెను ఆస్పత్రికి తరలించారు. పొదిలికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో తనను మోసం చేశాడని ఆమె చెబుతోంది.

## ఆర్జీయూకేటీలో విద్యార్థిని ఆత్మహత్య

విశ్వంభర, బాసర: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన సాయి ప్రియ పీయూసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఇద్దరు స్నేహితులతో కలసి క్యాంపస్ వసతి గృహంలోనే ఉంటుంది. సోమవారం ఉదయం తన ఇద్దరు స్నేహితురాళ్లు అల్పాహారం కోసం వెళ్లగా.. గదిలో సాయి ప్రియ మాత్రమే ఉంది. వారు తిరిగి వచ్చే చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి చేతిలో ఓ సూసైడ్ నోట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్జీయూకేటీకి ఇటీవల నూతన ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ నియామకం తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం తొలిసారి. పోలీసులు మరిన్ని వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

## ఐదేండ్ల తర్వాతనే ఇండ్ల స్థలాలు..

### జర్నలిస్టులకు సీఎం రేవంత్ రెడ్డి షాక్

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ జర్నలిస్టులకు సీఎం రేవంత్ రెడ్డి షాకిచ్చారు. జర్నలిస్టులందరికీ రేపోమాపో ఇండ్ల స్థలాలు ఇస్తామని ఊదరగొట్టిన రేవంత్ రెడ్డి మాటమార్చారు. ఇప్పట్లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వమని, మళ్లీ అధికారంలోకి రాగానే ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు.మేము అధికారంలోకి రాగానే జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలను క్లియర్ చేశాం. మొదటి విడత జర్నలిస్టుల ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశాం. మీకు సోషల్ రెస్పాన్స్‌బిలిటీ ఉండాలి. రెండో విడత కూడా ఇస్తాం. రెండో సారి అధికారంలోకి రాగానే అవి కూడా ఇస్తాం. జర్నలిస్టులకు నా విజ్ఞప్తి. మీరు కూడా ప్రభుత్వానికి సహకరించాలని రేవంత్ రెడ్డి కోరారు.

## డిండి బాలికల గురుకుల పాఠశాలలో

# జోనల్ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే

### ప్రభుత్వ ఐటీఐ నందు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ భవన నిర్మాణాల పరిశీలన

### డిండి ప్రాజెక్ట్‌లో ఉచిత చేప పిల్లల పంపిణీ



విశ్వంభర, డిండి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల బాలికల జోనల్ స్థాయి స్పోర్ట్స్ టోర్నమెంట్ ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని సానుకూల దృక్పథంతో స్వీకరించాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలో నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.తమ ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో పాటు క్రీడా రంగ అభివృద్ధిపై విధివిధానాలను రూపొందించనున్నట్లు తెలిపారు.అనంతరం మండల కేంద్రములోని ప్రభుత్వ ఐటిఐ లో నూతన కోర్సుల కొరకు నిర్మిచే భవన నిర్మానాని పరిశీలించి వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కోరారు.అనంతరం డిండి ప్రాజెక్టో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో పాల్గోన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు,మండల పార్టీ అధ్యక్షులు రాజేష్ రెడ్డి,సొసైటీ చైర్మన్ మేకల కాశన్న,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్,పిఏసిఎస్ చైర్మన్ నాగార్జున రెడ్డి,యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్,కిన్నెర హరికృష్ణ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్ రావు,మాజి సర్పంచ్ లక్పతి నాయక్,నూకం వెంకటేష్ ,కలిమ్, పొలం లక్ష్మన్,గుర్రము రాములు,గడ్డమీడి సాయి,బుషిపాక వెంకటయ్య,బలమూరి తిరుపతయ్య, బొల్లే శైలేష్,విజేందర్ రెడ్డి,బాబు రామ్ నాయక్,డిసిఓ అర్జున్ ప్రసాద్, ఎంపీడీవో వెంకన్న, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంఈవో గోప్య నాయక్,ప్రిన్సిపాల్ శిరీష,వివిధ పాఠశాల పిఈటీలు లు,పీడీలు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం సంస్కృతి, సంప్రాదయాలకు పుట్టినిల్లు : శివ స్వామి



విశ్వంభర, సరూర్ నగర్ : శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శివ స్వామీజీ వారి జయంతోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ శైవ క్షేత్రం కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్ వి కుమార్, నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హైమ, మేనేజర్ కోటేశ్వరరావు, వాసవి ఇంటర్నేషనల్ పరివార్ అధ్యక్షులు జగిని శ్రీనివాస్ గుప్తా ల నెత్రుత్వంలో శ్రీ శైవ క్షేత్ర వనితాశక్తి ఇంటర్నేషనల్, దేవి దేవతల చిత్రపటాల పరిరక్షణ సమితి, ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్, హిందూ ధర్మ దీక్ష సేవక్ సంస్థల ఆధ్వర్యంలో ఆర్కే పురంలోని శ్రీ శైవ క్షేత్ర పీఠములో శైవ క్షేత్రంలో ఉచిత హెల్త్ క్యాంపు, ఉచిత కంటి, దంత పరీక్షలు, పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు, పంచభూత శివలింగాలకు అభిషేకం, ఆయుష్ హోమం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ స్వామి మాట్లాడుతూ...మన భారతదేశం సంస్కృతి, సంప్రాదయాలకు పుట్టినిల్లు అని, వేలాది సంవత్సరాలుగా మునులు, స్వామీజీల నుండి మనకు వారసత్వంగా వచ్చిన ఆచార సంప్రదాయాల పరిరక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ గుప్తా, ప్రసాద్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్, అడ్వకేట్ శ్రీనివాస చారి, తక్షణ గవర్నర్ చక్రపాణి, కాశెట్టి నగేష్, సాంబమూర్తి, రమణయ్య, ఉదయ్, నాంపల్లి శ్రీనివాస్, చోళ్ళేటి ఆనంద్, అంజయ్య, శ్యాం సుందర్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పట్టపగలే చోరీకి పాల్పడ్డ నిందితుడిని

# అరెస్ట్ చేసిన గుమ్మడిదల పోలీసులు

- చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు
- నిందితునిపై పలు పోలీస్ స్టేషన్‌లలో 150 కేసులు




విశ్వంభర, సంగారెడ్డి : గుమ్మడిదల మండల పరిధిలోని పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ కి పాల్పడ్డ నిందితున్ని అరెస్టు చేసిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. జిన్నారం పోలీసులు నిర్వహించిన పత్రిక సమావేశం లో వివరాలు వెల్లడించారు. గుమ్మడిదల పోలీసుల వివరాల ప్రకారం ఈనెల 3న గుమ్మడిదల గ్రామంలోని చిమ్ముల రవీందర్ రెడ్డి తమ బంధువుల ఇంట్లో పూజ ఉందని ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదే అదునుగా చూసుకొని వరంగల్ సంబంధించిన అమిద్ సయ్యద్ అలియస్ అహ్మద్ 42 సం" వ్యక్తి పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. నిందితుడు అమీద్ పట్టపగలు తాళాలు వేసిన ఇంటిని ఆదునుగా చూసుకొని తాళాలు పగలగొట్టి చోరీ చేయడం ఇతనికి ఉన్న అలవాటు అని నిందితుడు హమీద్ పోలీసుల విచారణలో తెలిపాడు. ఇతనిపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల పోలీస్ స్టేషన్లలో 150 నుంచి 200 సంబంధించిన కేసులు నమోదయ్యాయని చోరీ చేసే సమయంలో దొరకకుండా వేసుకున్న బట్టలను మార్చుకుంటూ పోలీసులను తప్పు తోవ పట్టిస్తున్నారని గుమ్మడిదల పోలీసులు తెలిపారు. నిందితుడు హొండా షైన్ బైక్ పై వచ్చి పట్టపగలే తాళం వేసిన ఇళ్లలో దొంగతనానికి పాల్పడ్డాడని పోలీసుల విచారణలో తెలిపాడు. చోరీకి పాల్పడ్డ నిందితుని వద్ద నుంచి 8 లక్షలు విలువచేసే పది తులాల బంగారం బిస్కెట్లు గుమ్మడిదల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుమ్మడిదల పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.కేసును చేదించిన గుమ్మడిదల పోలీస్ బృందాన్ని సీఐ సుధీర్ కుమార్ అభినందించారు.

## పేద ప్రజల అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలు



విశ్వంభర, భూపాలపల్లి :పేద ప్రజల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. సోమవారం మహాముత్తారం మాండలం, ఎంపిడిఓ కార్యాలయంలో యాస్పిరేషన్ పారా మీటర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అధికారులు చాలా కష్టపడి పనిచేస్తున్నారని, ఈ రోజు క్షేత్రస్థాయి పర్యటనలో చేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మారుమూల మండలాల అభివృద్ధికి 500 మండలాలను యాస్పి రేషన్ బ్లాకులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ బ్లాకుల్లో విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనేక ప్రాంతాల్లో విద్యా, వైద్యం, పారిశుధ్యం గురించి ఇబ్బందులు ఉన్నటువంటి పరిస్థితి ఉందని ఇది చాలా భాదా కరమని అన్నారు. కనీస సౌకర్యాలకు ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం కనీస సదుపాయాలు, అవసరాలు కల్పనకు యాస్పిరేషన్ బ్లాకులు ఏర్పాటుకు చేసినట్లు తెలిపారు. వెనుకబడ్డ ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయని గుర్తించిన తర్వాత దేశవ్యాప్తంగా 500 మండలాలను బ్లాకులుగా ఇవాళ ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఇవాళ మహాముత్తారం మండలం యాస్పి రేషన్ అంశాలలో దేశవ్యాప్తంగా ఆదర్శంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రధాని ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, మంత్రి పిఎస్ వంశీ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాపర్తి ప్రకాష్‌కు ఉత్తమ ఆర్గనైజర్ అవార్డు





విశ్వంభర, హైదరాబాద్ : తెలుగు సాహిత్య కళాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ అధినేత కాపర్తి ప్రకాష్ కి ఉత్తమ ఆర్గనైజర్ అవార్డు రవీంద్ర భారతిలో బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జర్నలిస్టు వెంకటనారాయణ , ప్రముఖ సాహితీ వేత్త జంట నగరాలలో పేరు ప్రసిద్ధులుగాంచినటువంటి వోలేటి పార్వతీశం , ఈటల సమ్మన్న , రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాసి సాంబయ్య , చిక్క రామదాసు , పట్టాభి అశోక్ ఇతర ప్రముఖులు ఎందరో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. దానికి స్పందిస్తూ కాపర్తి ప్రకాష్ ఈ అవార్డు రావడం చాలా సంతోషకరమైన విషయం అని భవిష్యత్తులో మంచి కార్యక్రమాలు చేపట్టడానికి అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## నూతన విగ్రహాలకు పూజలు



విశ్వంభర, ఫరూక్ నగర్ : ఫరూక్ నగర్ మండలం లోని మొగిలిగిద్ద గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీ శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయం యొక్క ప్రతిష్ట జరుపుకునే విగ్రహలు గ్రామానికి మంగళ వాయిద్యాలతో డప్పు చప్పుళ్ల తో భక్తుల ఆనందోత్సాహాలతో చేరుకున్నాయి. ఆంజనేయస్వామి పూర్వ దేవాలయాన్ని జీర్ణోద్ధరణ గావించి యజ్ఞాన్ని నిర్వహించారు. పూజలు నిర్వహించిన తర్వాత విగ్రహాలన్నీ కూడా వరి ధాన్యంలో ధాన్యాధివాసం చేశారు. ఈ నెల 25, 26, 27, 28 తేదీలలో సీతారామాంజనేయ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉన్నది. దీనికి జగద్గురు శంకరాచార్య హంపి విరుపాక్ష విద్యారణ్య భారతి స్వామీజీ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసారు.

## ఎమ్మెల్యే స్వగృహంలో శివ పంచాక్షరి జప యజ్ఞం



విశ్వంభర, పెద్ద శంకరంపేట : ఎమ్మెల్యే స్వగృహంలో శ్రీ జ్యోతిరాస్తు విద్యాపీఠం పసల్వాది స్వామి బ్రహ్మశ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శివ పంచాక్షరి జప యజ్ఞం వేలాదిమంది భక్తుల మధ్య ఘనంగానిర్వహించారు. నారాయణఖేడ్ నియోజకవర్గం కేంద్రంలో ని డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శాసనసభ్యులు స్వగృహంలో శివ పంచాక్షర జపయజ్ఞ సహిత శ్రీగురుపాదుకార్చాన మహోత్సవ కార్యక్రమాన్ని మహేశ్వర శర్మ సిద్ధాంతి చేతుల మీదుగా సోమవారం నిర్వహించారు. శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి దంపతులు పాల్గోని అమ్మవారి పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కోతుల, వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, సూర్యాపేటః** సమాచార హక్కు వికాస సమితి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలోని గ్రామాలలో పట్టణ వీధులలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలు, కోతులపై నివారణ చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుంటకండ్ల ముకుంద రెడ్డి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ముకుంద రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పరిధిలోని ఉన్న గ్రామాలలో పట్టణ ప్రాంతాలలో ఉన్న వీధులలో వీధి కుక్కలు మరియు కోతులు, నివాస పరిసర ప్రాంతాలకు పంట చేనుల పై వచ్చి ప్రజలపై దాడి చేయడం జరుగుతుంది దీనివల్ల చిన్న పిల్లలు మరియు వృద్ధులు రైతులు తీవ్ర గాయాలపాలై చికిత్స చేసుకునుటకు ఎక్కువ డబ్బులు ఖర్చు చేయవలసి వస్తున్నది అని తెలిపారు మరియు వృద్ధులకు చిన్న పిల్లలకు మరియు రైతులు వ్యవసాయ కూలీలు ఇంటి నుంచి బయటికెల్లటానికి మరియు వ్యవసాయ చేను లోనికి వెళ్లాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదని మరియు వీధి కుక్కలు వల్ల చిన్నపిల్లలపై వృద్ధులపై క్రూరంగా దాడి చేస్తున్నాయని అటు గాయాలు పాలైన వారు మృతి చెందుతున్నారని అన్నారు అదేవిధంగా గ్రామాలలో కోతుల వలన పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు ఇటి సమస్యపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ కి వివరించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఇట్టి విషయంపై తగు చర్యలు తీసుకుంటాము అని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉన్న సత్యనారాయణ రావు ,జిల్లా కార్యదర్శి కిన్నెర ఉపేందర్ రావు, జిల్లా కోశాధికారి మలిగిరెడ్డి కృష్ణారెడ్డి, సూర్యాపేట నియోజక వర్గ అధ్యక్షులు దండ వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షులు బంగారు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# కాలుష్యాన్ని ఏ మతమూ ప్రోత్సహించదు: సుప్రీంకోర్టు



దిల్లీ: బాణసంచా కాల్చడంపై నిషేధం ఉన్నప్పటికీ.. దీపావళి వేళ దిల్లీలో ప్రజలు టపాసులు కాల్చడంతో కాలుష్యపొగ కమ్మేసింది. దీనిపై ఇప్పటికే తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు .. తాజాగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ మతమూ కాలుష్యాన్ని ప్రోత్సహించదని వ్యాఖ్యానించింది. టపాసులు అమ్మకాలు, వాటిని కాల్చడాన్ని అరికట్టేందుకు దిల్లీ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

"కాలుష్యాన్ని సృష్టించే చర్యలను ఏ మతమూ ప్రోత్సహించదు. ఇదే తరహాలో టపాసులు పేలిస్తే.. ఆరోగ్యంగా జీవించేందుకు పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కును ఉల్లఘించినట్టే అవుతుంది" అని కోర్టు తీవ్రంగా స్పందించింది. నవంబరు 25లోగా వ్యాపార వర్గాలను సంప్రదించి శాశ్వతంగా బాణసంచాను నిషేధించే విషయంపై దిల్లీ ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలని సూచించింది. నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు దిల్లీ పోలీస్ కమిషనర్ ఓ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. రా మెటీరియల్ మాత్రమే సీజ్ చేసి కంటి దీపావళి తర్వాత దిల్లీలో కాలుష్యం పెరగడంపై గత విచారణలో సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. "టపాసులపై నిషేధం అమలు చేయలేదని వార్తలు వచ్చాయి. కాలుష్యాన్ని నివారించడానికి నిషేధాన్ని ముఖ్యమైన చర్యగా భావించాం. అసలు మీరు ఎలాంటి చర్యలు తీసుకున్నారు" అంటూ దిల్లీ పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. నిషేధాన్ని ఉల్లంఘించే వారి స్థలాలను సీల్ చేయడం వంటి కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్యానించింది. 2025 నాటి దీపావళికైనా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నంకాకుండా చర్యలు ఉండాలని సూచించింది. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రాజధాని నగరంలో కాలుష్య నియంత్రణే లక్ష్యంగా బాణసంచా తయారీ, విక్రయాలపై దిల్లీ ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నిషేధం వచ్చే ఏడాది జనవరి 1 వరకు అమలులో ఉంటుంది. బాణసంచా ఆన్‌లైన్‌లో విక్రయం, డెలివరీలకూ ఈ నిషేధం వర్తిస్తుందని సెప్టెంబర్‌లోని ప్రభుత్వం పేర్కొన్నా.. టపాసుల మోత మాత్రం ఆగలేదు. తుడుపు చర్యలకు పాల్పడ్డారంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది.

## ఓటింగ్ వద్దు.. నాకు నచ్చిన వాళ్లను నియమించుకుంటా



వాషింగ్టన్: అగ్రరాజ్య అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిష్ఠించేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్.. తన పాలకవర్గంపైఈసారి ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ఇందులోభాగంగానే కేబినెట్ నియామకాలపై తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సెనెట్ సమ్మతి లేకుండానే తనకు ఇష్టమొచ్చిన అధికారులను నియమించుకునే హక్కు ఇవ్వాలని రిపబ్లికన్ చట్టసభ్యులను డిమాండ్ చేశారు. ఇందుకోసం నిబంధనలు మార్చాలనిట్రంప్ పట్టుబట్టినట్లు సమా చారం. అమెరికా రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. కేబినెట్, జ్యుడీషియల్ పోస్టులకు ఎవరినైనా అధ్యక్షుడు నామినేట్ చేస్తే దానికి సెనెట్ అనుమతి పొందడం తప్పనిసరి. అయితే, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అధ్యక్షుడు ఈ సెనెట్ ఓటింగ్‌కు బైపాస్ చేసే సదుపాయం కూడా ఉంటుంది. తాజాగాట్రంప్ దాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. తద్వారా పరిపాలనలో డెమోక్రట్లు జోక్యం చేసుకునే అధికారానికి కోత పెట్టాలని ట్రంప్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సెనెట్‌లో రిపబ్లికన్లకు ఆధిక్యం దక్కిన సంగతి తెలిసిందే. ఈ సభలో మొత్తం 100 మంది సభ్యులుండగా.. రిపబ్లికన్ పార్టీకి 52, డెమోక్రటిక్ పార్టీకి47 సభ్యులున్నారు. దీంతో సెనెట్‌లో రిపబ్లికన్లు తమ పార్టీ పక్ష నేతను ఎన్నుకునేందుకు బుధవారం ఓటింగ్ జరగనుంది. దీనికి సెనెటర్లు జాన్ థునే, జాన్ కోర్నిన్, రిక్ స్కాట్ పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురు ట్రంప్‌నకు అత్యంత సన్నిహితులేనని సమాచారం.

## అయోధ్య రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం..

### ఉగ్రవాది పన్నూన్ బెదిరింపులు

అయోధ్య :సిక్కు వేర్పాటువాద నాయకుడు, ఖలిస్థానీఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి తీవ్ర బెదిరింపులకు పాల్ప డ్డారు. అయోధ్యలోని రామ మందిరం సహా హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకొని హెచ్చరికలు జారీ చేశారు. నవంబర్ 16, 17 తేదీల్లో ఆలయాలపై దాడి చేస్తామంటూ హెచ్చరించాడు. ఈ మేరకు ఓవీడియో రిలీజ్‌చేశారు. 'హింసాత్మక హిందుత్వ భావజాలానికి పుట్టినిల్లు అయిన అయోధ్య పునాదులను పెకిలిస్తాం' అంటూ హెచ్చరించారు. ఈవీడియోలోరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలను ప్రదర్శించారు. మరో వైపు హిందూ దేవాలయాలపై ఖలిస్తాన్ దాడులకు దూరంగా ఉండాలని కెనడాలోని భారతీయులను కూడా పన్నూన్ హెచ్చరించాడు. కాగా, పన్నూన్ ఇలా బెదిరింపులక పాల్పడటం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ అనేక సార్లు ఇలాంటి హెచ్చరికలే చేశారు నవంబర్1వ తేదీ నుం చి 19వ తేదీ వరకూ ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దంటూ గత నెలలో వార్నింగ్ ఇచ్చాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాడు. గతేడాది కూడా నవంబర్ నెలలోనే ఇలాంటి బెదిరింపులే చేశాడు. నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాల్లో సిక్కులు ప్రయాణించొద్దని సూచించాడు. లేని పక్షంలో మీ ప్రాణాలకు ముప్పు ఉంటుందని హెచ్చరించాడు. నవంబర్ 19న ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం మూసివేస్తారని పన్నూన్ తెలిపాడు. భవిష్యత్తులో ఆ విమానాశ్రయం పేరు కూడా మారుతుందని అన్నాడు. ఇప్పుడు రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం అని బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది.

## ఆ ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..

### ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం సవాల్



బెంగళూరు: కర్ణాటక ఎక్సైజ్ శాఖలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ .. ఆ ఆరోపణలను నిరూపించాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ సవాల్ విసిరారు. ఆరోపణలు నిజమని రుజువైతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. నిరూపించలేకపోతే మోదీ రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రెండు రోజుల క్రితం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ మాట్లాడుతూ.. కర్ణాటక ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం జరిగిందని, ఆ సొమ్మును మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ వాడుకుంటోందని ఆరోపించారు. 'ఎక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. ఆ రాష్ట్రం కాంగ్రెస్ రాజ కుటుంబానికి డబ్బులు అందించే ఏటీఎంగా మారిపోతుంది. ఇప్పుడు కాంగ్రెస్ రాజ కుటుంబానికి తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఏటీఎంలుగా మారిపోయాయి. మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతుంటే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ వసూళ్లకు పాల్పడుతున్నది. మహారాష్ట్రలో ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటకలో వసూళ్లు రెట్టింపయ్యాయని ప్రజలు చెప్తున్నారు. కర్ణాటకలోని లిక్కర్ వ్యాపారుల నుంచి రూ.700 కోట్లు వసూలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి.' అని మోదీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో మోదీ ఆరోపణలను సీఎంసిద్ధరామయ్య ఖండించారు. నిధుల దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు. ఈ దేశ ప్రధాని ఇంత అబద్ధాలు చెప్పడం చూసి ఆశ్చర్యపోయానన్నారు. 'మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేస్తూ.. కర్ణాటక కాంగ్రెస్ ఎక్సైజ్ శాఖలో కుంభకోణానికి పాల్పడిందని మోదీ ఆరోపించారు. మహారాష్ట్ర, జార?ండ్ ఎన్నికల్లో ఖర్చుచేసేందుకు రూ.700 కోట్లు సమీకరించిందని ఆయన పేర్కొన్నారు. ఈ దేశ ప్రధాని ఇంత అబద్ధాలు చెప్పడం చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. ఈరోజు నేను ప్రధానికి ఓ సవాల్ విసురుతున్నా. ఆయన చేసిన ఆరోపణలను నిరూపిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా. నిరూపించకపోతే ఆయన పాలిటిక్స్ నుంచి తప్పుకోవాలి' అని సిద్ధరామయ్య అన్నారు. కాగా, కర్ణాటక వైన్ మర్చెంట్స్ అసోసియేషన్ ఇటీవల ఎక్సైజ్ విభాగంపై తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్‌ను లక్ష్యంగా చేసుకుంది. లైసెన్సులు మంజూరు చేసేందుకు, ట్రాన్స్‌ఫర్ల కోసం రూ. 30 లక్షల నుంచి రూ. 70 లక్షలు వసూలు చేస్తున్నట్టు ఆరోపించింది. గత ఏడాది కాలంలో ఇలా 1000 లైసెన్సులను అక్రమంగా కేటాయించారని, ఫలితంగా రూ. 300–700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించింది.

## 'మోదీ మా డిమాండింగ్ బాస్'..: జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు



ముంబయి: ప్రధాని నరేంద్రమోదీ గురించి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన తమ 'డిమాండింగ్ బాస్' అని అన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్ర మంలో పాల్గొన్న ఆయన ప్రధానితో జరిగే సమావేశాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు. "నిత్యం ప్రధాని మోదీతో మంత్రులకు సమావే శాలు జరుగుతుంటాయి. ఆయనతో సమావేశం అంటే చర్చించే విషయం పై కచ్చితమైన డేటాతో రావాల్సిందే. ఎందుకంటే, ఆ విషయంపై ఆయనకు పూర్తి అవగాహన ఉంటుంది. ప్రతి అంశంపై క్షుణంగా చర్చిస్తారు. ఆయన నిజాయతీ గల వ్యక్తి. ప్రధాని మా డిమాండింగ్ బాస్. నిజంగా ఆయనతో కలిసి పనిచేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది" అని పేర్కొన్నారు. "ఉక్రెయిన్– రష్యాయుద్ధం వేళ భారతీయ విద్యార్థులను రక్షించేందుకు ఎంతో కృషి చేశారు. అక్కడ ఉన్నవారికి ఎలాంటి హాని కలగకుండా స్వదేశానికి తీసుకురావాలంటూ మమ్మల్ని ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది దేశాధినేతలతో భారత్ సత్సంబంధాలు ఏర్పరుచుకుంది. ట్రంప్ సహా ఒబామా, జోబైడెన్‌ల హయాంలో అమెరికాతో స్నేహబంధం కొనసాగుతోంది. ఎంతమంది నేతలు మారినా ఆ దేశంతో బంధం స్థిరంగా ఉంది. అందుకు ప్రధాని మోదీనే కారణం" అని జైశంకర్ అన్నారు. మరోవైపు.. ముంబయిలో నిర్వహించిన ఇండియా–రష్యా బిజినెస్ ఫోరంలో పాల్గొన్న విదేశాంగ మంత్రి ప్రసంగించారు.

### సమస్యలు పరిష్కరించుకోవాలి..

భారత్– రష్యా పరిష్కరించుకోవాల్సిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ప్రతిపాదిత ఇండియా–యురేషియన్ ఎకనామిక్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై చర్చలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంకింగ్, పేమెంట్, రవాణా సవాళ్లు, బీమా, మార్కెట్ ప్రవేశాలు తదితర సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 66 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం.. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల లక్ష్యానికి చేరుకోవాలన్నారు. అందుకు ఇరుదేశాల మధ్య సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్ కూడా పాల్గొన్నారు.

## భారత్- ఇండోనేషియా దళాల 'గరుడ శక్తి' విన్యాసాలు భళా!



జకార్తా: 'గరుడ్ శక్తి' పేరిట భారత్, ఇండోనేషియా ప్రత్యేక బలగాల ఉమ్మడి విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. ఇరు దేశాల మధ్య సైనిక సహకారం, అవగాహనే లక్ష్యంగా నవంబర్ 1న జకార్తాలో ప్రారంభమైన ఈ ప్రత్యేక దళాల విన్యాసాలు నవంబర్ 12వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా భారత్ నుంచి 25మంది సిబ్బందితో కూడిన బృందం జకార్తాలోని సిజాంటుంగ్‌కు బయల్దేరి వెళ్లి అక్కడి సైనికులతో కలిసి విన్యాసాల్లో పాల్గొంది. భారత్ (%×అఎఖుఅ ాతీఎఎ%) తరఫున పారాచూట్ రెజిమెంట్ (స్పెషల్ ఫోర్సెస్) నుంచి సైనికులు ప్రాతినిధ్యం వహించగా.. ఇండోనేషియా (%×అసశీఅవంఖు%) నుంచి 40 మంది సైనిక సిబ్బందితో కూడిన ప్రత్యేక దళం కొపాసస్ ప్రాతినిధ్యం వహించింది.'గరుడ్ శక్తి 24 లో భాగంగా నిర్వహించిన ఈ విన్యాసాలు ఇరు దేశాలకు చెందిన ప్రత్యేక దళాల మధ్య పరస్పర అవగాహన, ద్వైపాక్షిక సహకారం పెంపొందించడంతో పాటు వ్యూహాత్మక సైనిక విన్యాసాల రిహార్సల్స్ ద్వారా పరస్పర చర్యలను మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేక ఆపరేషన్లకు ప్రణాళిక, పర్యవేక్షణ, ప్రత్యేక దళాల నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ఆయుధాలు, పరికరాలు, ఆవిష్కరణలు, ఎత్తుగడలపై సమాచారాన్ని పంచుకోవడం వంటివి కీలకాంశాలుగా ఉన్నాయి. ఈ విన్యాసాల ద్వారా అటవీ ప్రాంతాల్లో సంయుక్త ఆపరేషన్లు చేపట్టడం, ఉగ్రవాదుల శిబిరాలపై దాడులు వంటి అంశాలపై ప్రత్యేక దళాల నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, ఇరు సైన్యాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడం, ఉత్తమ అభ్యాసాలను షేర్ చేసుకోనే అవకాశం కలుగుతుంది. ఇరు దేశాలకు చెందిన బలగాల జీవన శైలి, సంస్కృతులను తెలుసుకొనేందుకు వీలు కలుగుతుంది. రెండు స్నేహపూర్వక దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతమయ్యేందుకు దోహదం చేస్తుంది.

## అది అబద్ధం.. పుతిన్-ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకోలేదు: రష్యా

మాస్కో: అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ తమ అధ్యక్షుడు పుతిన్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని రష్యా వెల్లడించింది. ఆ వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని, అదంతా తప్పుడు ప్రచారమని స్పందించింది. గత గురువారం ఫ్లోరిడాలోని తన ఎస్టేట్ నుంచి ట్రంప్.. పుతిన్‌తో ఫోన్ లో మాట్లాడినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం వెలువరించింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని విస్తరించొద్దని కోరినట్లు, యుద్ధంపై పరస్పరం చర్చించి ఓ పరిష్కారాన్ని కనుగొందామని రష్యా అధినేతకు సూచించినట్లు తెలిపింది. దీనిని ఉద్దేశించే రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ నుంచి స్పందన వచ్చింది.

"సమాచారం నాణ్యత ఏ స్థాయిలో ఉంటుందో ఈ వార్తలను చూస్తుంటే తెలుస్తుంది. పేరున్న సంస్థలు ఇందుకు మినహాయింపేమీ కాదు. ఈ సమాచారం పూర్తిగా అవాస్తవం. ఇదంతా ఊహాజనిత, తప్పుడు సమాచారం" అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మీడియాతో మాట్లాడారు. ఈ ఇద్దరు నేతల మధ్య చర్చల కోసం ప్రస్తుతానికి ఎలాంటి ప్రణాళికలు లేవని తెలిపారు. తాను అధికారంలోకి వస్తే ఒక్క రోజులో ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ముగిస్తానంటూ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగానే ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. తాను యుద్ధాన్ని ప్రారంభించబోనని, దాన్ని ముగించేందుకు సాయం చేస్తానంటూ భరోసానిచ్చారు. ఇదిలా ఉంటే.. అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌నకు ఇటీవల పుతిన్ అభినందనలు తెలిపారు. ఎన్నికల ఫలితాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చిన రష్యా అధినేత.. "ట్రంప్ ధైర్యవంతుడు. ఆయనతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నా" అని అన్నారు. ఉక్రెయిన్ వివాదానికి 24 గంటల్లో ముగింపు పలకగలనన్న ట్రంప్ సూచనను గతంలో క్రెమ్లిన్ స్వాగతించిన సంగతి తెలిసిందే.

## పూర్వీకుల ఇంటి కోసం సీజేఐ అన్వేషణ..!



దిల్లీ: తన పూర్వీకుల ఇంటి కోసం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్వేషిస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన ఆ ఇంటి ఆనవాలు సీజేఐకి కనిపించడం లేదట. ఆయన సన్నిహితులను ఉటంకిస్తూ జాతీయమీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు వెళ్లినప్పుడల్లా కత్రా షేర్‌సింగ్ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. అది ఆయనొక తీర్థయాత్ర లాంటిది. కాలక్రమంలో ఆ ప్రాంతంలో ఎన్నో మార్పులు వచ్చాయి. కానీ సీజేఐ మాత్రం ఆ ప్రదేశంలో తన తాతయ్య సరవ్ దయాల్ కట్టిన ఇల్లు గురించి అన్వేషిస్తుంటారట. ప్రముఖ న్యాయవాదిఅయిన దయాల్ స్వాతంత్ర్యానికిపూర్వం రెండు ఇళ్లను కొనుగోలు చేశారు. జలియన్ వాలాబాగ్ సమీపంలోని కత్రా షేర్‌సింగ్ ప్రాంతంలో ఒక ఇల్లు, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసీలో మరో ఇల్లు కొన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో పంజాబ్‌లోని ఇల్లు అగ్నికి ఆహుతైంది. అయితే తర్వాత సరవ్ దానిని పునరుద్ధరించారు. సీజేఐకు ఐదేళ్ల వయసున్నప్పుడు తన తండ్రితో కలిసి ఒకసారి ఆ ఇంటికి వెళ్లారు. ఆ ఇంటితో పాటు హిమాచల్‌లోని నివాసం ముందు కూడా బోర్డుపై %ధీుబయిఱ% అని రాసి ఉంటుంది. సరవ్ మరణం తర్వాత 1970ల్లో అమృత్‌సర్ ఇంటిని అమ్మివేశారు. ఇన్ని దశాబ్దాల్లో ఆ ప్రాంతంలో కొత్త నిర్మాణాలు వచ్చాయి. పలు మార్పులు చోటుచేసుకున్నాయి. కానీ చిన్నతనంలో వెళ్లినఆ ఇంటి జ్ఞాపకం మాత్రం జస్టిస్ సంజీవ్ ఖన్నా మదిలో అలాగే ఉండిపోయింది. అందుకే కత్రా షేర్‌సింగ్ ప్రాంతంలోని తన పూర్వీకులు నివసించిన ఆ ఇంటిని ఇప్పటికీ అన్వేషిస్తున్నారు. అమృత్‌సర్ వెళ్లినప్పుడల్లా కత్రా ప్రాంతంలో ఆగి, ఆ ఇంటికోసం వెతుకుతుంటారని ఆయన సన్నిహితులు తెలిపారు. న్యాయవాదిగా సేవలు అందించిన సరవ్ దయాల్.. జలియన్ వాలాబాగ్ దురంతం తర్వాత కాంగ్రెస్ ఏర్పాటుచేసిన కమిటీలో పనిచేసినట్లు తెలుస్తోంది. ఓ సందర్భంలో సీజేఐ తన తాతయ్య గురించి వెల్లడించారు. వేసవి సెలవులకు వెళ్లినప్పుడల్లా వెంట పుస్తకాలు తెచ్చుకోవద్దని తాతయ్య చెప్పేవారని, తాను చెప్పే విషయాలు పుస్తకాల్లో ఉండవనేవారని గుర్తుచేసుకున్నారు.

## అమెరికా 'బోర్డర్ జార్'గా టామ్ హొమన్



న్యూయార్క్: అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిష్ఠించేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్.. తన పాలకవర్గంపై ప్రత్యేక దృష్టిపెట్టారు. తన మాజీ తాత్కాలిక యూఎస్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్టామ్ హొమన్‌ను 'బోర్డర్ జార్' గా నియమించనున్నట్లు ప్రకటించారు. దక్షిణ, ఉత్తర సరిహద్దులను పర్యవేక్షించడంతోపాటు, సముద్ర, విమానయాన భద్రతను పర్యవేక్షించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషిస్తాడని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతా వ్యవహారాలను నిర్వహించడంలో ఆయనకు మంచి పట్టు ఉందన్నారు. అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించినవారిని పంపించే బాధ్యత కూడా ఆయనే నిర్వహిస్తారని.. టామ్ హొమన్ ఈ బాధ్యతలను అద్భుతంగా నిర్వర్తిస్తారనడంలో తనకు ఎటువంటి సందేహం లేదని తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా పేర్కొన్నారు. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో హొమన్ యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న అక్రమ వలసదారులను అరెస్టు చేయాలని ట్రంప్ అనుకోవట్లేదని, చట్టపరంగా వారిని దేశం నుంచి పంపడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారాల్లో భాగంగా ట్రంప్ మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే అక్రమంగా వలస వచ్చినవారిని వెనక్కి పంపుతానని పలుమార్లు స్పష్టంచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హొమన్‌ను 'బోర్డర్ జార్'గా ప్రకటించడంతో ఇతర దేశాల నుంచి అమెరికాకు అక్రమంగా వచ్చిన వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. కాగా అధ్యక్ష ఎన్నికల్లో తనను విజయతీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన ఎన్నికల ప్రచార మేనేజర్ సూసీ వైల్స్ ను వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమిస్తున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అమెరికా చరిత్రలో మొట్టమొదటి మహిళా చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీనే కావడం విశేషం.

## బైడెన్ రాజీనామా చేసి కమలాహారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి..!



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ పదవీకాలం ముగియడానికి కొన్ని వారాలే మిగిలి ఉన్న సందర్భంలో ఓ కొత్త డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇటీవల జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలా హారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జమాల్ సిమన్స్ సూచించారు. బైడెన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, ఉపాధ్యక్షురాలు హారిస్‌ను అమెరికాకు మొదటి మహిళా అధ్యక్షురాలిని చేయాలని ఆయన ఓ టాక్ షోలో పేర్కొన్నారు. ఇప్పటివరకు జో బైడెన్ అద్భుతంగా పరిపాలించారు.. కానీ, ఆయన చివరి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రాబోయే కాలంలో అధ్యక్షఎన్నికల పోటీలో మహిళలు నిలవడానికి ఈ ప్రక్రియ దోహదం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ పోటీ చేసి ఓడిపోయారు. అధికారం చేజిక్కించుకోవడానికి కీలకమైన స్వింగ్ రాష్ట్రాలను సొంతం చేసుకుంటూ ట్రంప్ 312 ఎలక్టోరల్ ఓట్లతో విజయం సాధించగా, హారిస్ 226 ఎలక్టోరల్ ఓట్లను కైవసం చేసుకున్నారు. ఓటమి అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రజలందరి స్వేచ్ఛ, న్యాయం, అవకాశాలు, గౌరవం కోసం పోరాటం కొనసాగిస్తానన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన, సమాన న్యాయం కోసం శ్రమిస్తూనే ఉంటానన్నారు. కొన్నిసార్లు సానుకూల ఫలితాలకు సమయం పడుతుందని.. కానీ, దానర్థం గెలవలేమని కాదని హారిస్ పేర్కొన్నారు. స్వేచ్ఛ, న్యాయం, భవిష్యత్తు కోసం మళ్లీ నిలబడాల్సిన, నిమగ్నం కావాల్సిన సమయం ఇదేనని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు.

విశ్వంభర V3 NEWS

# యువతకు అవకాశాలు కల్పిస్తే తిరుగులేని ఫలితాలు

## రానున్న రోజుల్లో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు
## ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలి : ఏపీ సీఎం చంద్రబాబు



విశ్వంభర, అమరావతి: రానున్న రోజుల్లో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు అమలు చేసి ఫలితాలు సాధిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అవకాశాల కల్పనతో సంపద సృష్టి సాధ్యం అవుతుందన్నారు. తద్వారా వచ్చిన సంపదను పేద వర్గాలకు పంచి ప్రజల జీవన ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047పై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ తొలి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. విజన్-2047 లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం చర్చించారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఛైర్మన్‌గా సీఎం చంద్రబాబు, కో-ఛైర్మన్‌గా టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యవహరించనున్నారు. రాష్ట్ర మంత్రులు, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జీఎం రావు, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్ సుబ్రహ్మణ్యన్, టీవీఎస్ కంపెనీ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, అపోలో ప్రతినిధి ప్రీతారెడ్డి, పిరమల్ గ్రూప్ ఛైర్మన్ అజయ్ పిరమల్, రెడ్డి ల్యాబొరేటరీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డితో పాటు పలు ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. విజన్-2047పై ప్రభుత్వ ఆలోచనలు, పాలసీలను చంద్రబాబు వారితో పంచుకున్నారు. వివిధ రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి ఉత్తమ పాలసీలపై తన ఆలోచనలు, అనుభవాలు చెప్పారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 13.5 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు.. నేడు 15 శాతం వృద్ధి రేటు సాధిస్తామని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. దీనికి అవసరమైన ప్రణాళికలు, పాలసీలను ప్రభుత్వం అమలు చేస్తుందని సీఎం తెలిపారు. ఇప్పుడు టెక్నాలజీ మరింత అడ్వాన్స్‌డ్‌గా ఉందని.. దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతకు అవకాశాలు కల్పిస్తే తిరుగులేని ఫలితాలు వస్తాయన్నారు.ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలి..ఏపీలో సహజ వనరులు, మానవ వనరులు, మౌళిక సదుపాయాలు, హైవేలు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. నాడు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' గురించి మాట్లాడామని, ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' గురించి మాట్లాడుతున్నాం. నాడు ప్రతి ఇంటి నుంచి ఒక ఐటీ ఉద్యోగి ఉండాలనే లక్ష్యంతో పని చేశాం. నేడు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులకు అవసరమైన భూములు, నీళ్లు, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు బెస్ట్ పాలసీలు కూడా ప్రకటించాం" అని సీఎం తెలిపారు.

## ఏపీఎస్ఆర్టీసీకి మరోసారి ప్రతిష్ఠాత్మక 'స్కోచ్' అవార్డు




విశ్వంభర, అమరావతి: 2024 ఏడాదికిగానూ ప్రతిష్ఠాత్మక 'స్కోచ్' అవార్డును ఏపీఎస్ఆర్టీసీ దక్కించుకుంది. యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్ల జారీ, బస్సుల్లో డిజిటల్ టికెట్ల జారీ చేస్తున్నందుకు ఈ అవార్డు సొంతం చేసుకుంది. బస్సుల్లో ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు ఆర్టీసీని ఈ అవార్డు వరించింది. ఆర్టీసీ ఈడీ రవివర్మ, ఐటీ చీఫ్ ఇంజినీర్ వి.సుధాకర్ ఈ అవార్డును అందుకున్నారు.

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన
# పోసానిపై చర్యలు తీసుకోండి!



విశ్వంభర, రాజమహేంద్రవరం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన కుటుంబీకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు పోసానిపై చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం జనసేన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో పోసాని అనేకసార్లు పవన్‌తో పాటు, జనసేన కార్యకర్తలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పదజాలంతో దూషించినా అప్పట్లో పోలీసులు చర్యలు తీసుకోలేదని, తాము కోర్టును ఆశ్రయించామని ఈ సందర్భంగా వారు తెలిపారు.మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసులపైన సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్న విశాఖపట్నానికి చెందిన రవికిరణ్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెదేపా నాయకుడు చిన్నబాబు ఈనెల 7న రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని సోమవారం అరెస్టు చేసి.. న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు ప్రకాశ్‌నగర్ పోలీసులు తెలిపారు.

## విశాఖ అభివృద్ధికి కృషి చేస్తా: వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్



విశ్వంశభర, అమరావతి: విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) ఛైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ మేరకు సచివాలయంలో సీఎం చంద్రబాబును ప్రణవ్ గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని.. విశాఖ అభివృద్ధికి కృషి చేస్తానని సీఎంకు హామీ ఇచ్చారు. అనునిత్యం ప్రజల కోసమే పనిచేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన వీఎంఆర్డీఏ పరిధిలో ఉన్న ఎంపీలు, ఎంఎమ్మెల్యేలు, కూటమి నేతలు, కార్యకర్తలు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, శ్రేయోభిలాషులను ప్రణవ్‌గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

## చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖకు
# బడ్జెట్ కేటాయింపులు: ఏపీ హోంమంత్రి అనిత



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసంతో తిరోగమనంలోకి పోయిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి సాధారణ స్థాయికి తీసుకొచ్చే విధంగా 2024-25 బడ్జెట్ ఉందని రాష్ట్ర హోం శాఖ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత లభించిందన్నారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌లో ప్రతి రంగానికి కేటాయింపులు చేశామన్నారు. రాష్ట్ర జీఎస్డీపీలో 40 శాతానికి పైగా వాటా ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.43,402 కోట్లు కేటాయించడం ద్వారా రైతు సంక్షేమ ప్రభుత్వం అన్న పేరుకు సార్థకత లభించిందన్నారు. విద్య, వైద్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధితో పాటు రాష్ట్ర రాహదారుల కోసం సింహభాగం ఖర్చు చేయాలని భావించడం ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు. "గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని, వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు మొహం చాటేశారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో కీలకమైన బడ్జెట్ సమావేశాలకు కూడా రాకుండా తమ బాధ్యతారాహిత్యాన్ని బహిర్గతం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖకు బడ్జెట్‌లో రూ. 8,495 కోట్లు కేటాయించాం. గత ప్రభుత్వ పాలనలో అరకొర సౌకర్యాలతో పోలీసులు ఎన్నో కష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీస్ శాఖలో ప్రక్షాళన చేపట్టింది. పోలీసు శాఖలో ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన కోసం ఇప్పటికే రూ.62 కోట్లు విడుదల చేశాం. శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, రాజమహేంద్రవరంలో కొత్తగా 4 స్పెషల్ పోలీస్ బెటాలియన్లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని పట్టిపీడించిన మాదకద్రవ్యాలను రాష్ట్రంలో లేకుండా చేసేందుకు నిబద్ధతతో పనిచేస్తున్నాం. అందుకే యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా ఉంచేందుకు ఉన్నత విద్యాసంస్థల్లో 3,172 యూనిట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని అనిత పేర్కొన్నారు.

## టూరిజం కార్యదర్శిగా స్మితా సభర్వాల్
## 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటకం, సాంస్కృతిక, యువజన సర్వీసుల కార్యదర్శిగా స్మిత సభర్వాల్‌ను నియమించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో ఆమె కొనసాగనున్నారు.

### బదిలీ అయిన ఇతర ఐఏఎస్‌ల వివరాలు

**బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి: ఇ.శ్రీధర్**
**(దేవాదాయ శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు)**
**మహిళ, శిశు సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి: అనిత రామచంద్రన్**
**జీహెచ్ఎంసీ కమిషనర్: ఇలంబరితి**
**రవాణాశాఖ కమిషనర్: కె. సురేంద్ర మోహన్**
**ఎక్సైజ్ శాఖ డైరెక్టర్: సీహెచ్ హరికిరణ్**
**ట్రాన్స్ కో సీఎండీ : డి. కృష్ణ భాస్కర్**
**(డిప్యూటీ సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు)**
**ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో: శివశంకర్**
**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్: సృజన**
**ఇంటర్ బోర్డు కార్యదర్శి: ఎస్. కృష్ణ ఆదిత్య**

## నవంబర్ 22 వరకు అసెంబ్లీ సమావేశాలు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అమరావతి: వైసీపీ ఎమ్మెల్యే, మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి రాకపోయినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యానించారు. ఈ నెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు సీరియస్‌గా జరుగుతాయని అయ్యన్న స్పష్టం చేశారు. మంగళవారం బడ్జెట్ పై అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎమ్మెల్యేలందరికీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శనివారం కూడా సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బిల్లులు, చర్చలకు అనుగుణంగా కొన్ని రోజులు రెండు పూటలా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎవరి కోసమో అసెంబ్లీ సమావేశాలు ఆగవని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన చర్చ జరపడం ఎమ్మెల్యేల బాధ్యత అని సీఎం పేర్కొన్నట్లు చెప్పారు. 1995లో తెల్లవారుజామున 4గంటలకు రాత్రి భోజనం చేసిన సందర్భాలు ఉన్నాయని ఈ సందర్భంగా అయ్యన్న గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు విధిగా అసెంబ్లీకి హాజరవ్వాలని.. చీఫ్ విప్, విప్‌లను మంగళవారం ఖరారు చేస్తామని సీఎం చెప్పారన్నారు.

## అసభ్యకర పోస్టుల కేసులో నిందితుల కోసం
# గాలింపుచర్యలు: డీఐజీ ప్రవీణ్



విశ్వంభర, కడప: సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత తదితరులపై అసభ్యకర పోస్టుల కేసులో నిందితులను పట్టుకునేందుకు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ తెలిపారు. ఆదివారం మార్కాపురం సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అసభ్యకర పోస్టుల కేసులో అరెస్టయిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితులు సుబ్బారెడ్డి, ఉదయ్‌లను పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. కేసుకు సంబంధించిన వివరాలను కోయా ప్రవీణ్, కడప ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాకు వివరించారు.

"నిందితులు వాడిన భాష అసభ్యకరంగా ఉంది. అరబ్ దేశాల్లో అయితే తీవ్ర శిక్షలు ఉంటాయి. సీఎం, డిప్యూడీ సీఎం కుటుంబాలపై తీవ్రమైన దూషణలు వాడారు. వర్రా రవీందర్‌రెడ్డి గతంలో భారతి సిమెంట్స్‌లో పని చేశాడు. మరో ఇద్దరు కూడా వైకాపా సోషల్ మీడియాలో పని చేస్తున్నారు. డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైకాపాకి అనుకూలంగా వినియోగించుకున్నారని నిందితులు తమ వాంగ్మూలంలో చెప్పారు. న్యాయమూర్తులకు వ్యతిరేకంగా కూడా పోస్టులు పెట్టారు. మహిళా కుటుంబసభ్యులు, వారి పిల్లలపై పోస్టులు పెట్టారు. ఇలాంటి వారిని 45 మందిని గుర్తించాం. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశాం. నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టేవారు. నిందితులకు 40 యూట్యూబ్ ఛానెళ్లు ఉన్నట్లు గుర్తించాం. వాటి ద్వారా అసభ్యకర వ్యాఖ్యలు చేసేవారు. తాడేపల్లిలోని వైకాపా కార్యాలయం నుంచి వీటిని నడిపేవారు. జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో వీరంతా పని చేసేవారు. తాడేపల్లిలోని పీవీఆర్ ఐకాన్ బిల్డింగ్ నుంచే పోస్టులు పెట్టేవారు. అధికారంలో ఉన్న మహిళా నేతలనే టార్గెట్ చేసుకొని పోస్టులు పెట్టారు. నిందితులు ఇచ్చిన వాంగ్మూలాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉంది. వారు పెట్టిన పోస్టులను సాధారణంగా చదవలేం. సభ్య సమాజం అసహ్యించుకునేలా వారి పోస్టులు ఉన్నాయి. మహిళలపై ఇలాంటి పోస్టులు పెట్టిన వారిని రాక్షసజాతికి చెందినవారిగా భావిస్తున్నాం" అని ప్రవీణ్ వివరించారు.ల

## లారీ కింద ఇరుక్కుపోయి
# కేంద్ర మంత్రి చొరవతో బయటపడి

- బైక్‌పై వెలుతూ పడిపోయి లారీ కింద పడిపోయిన మహిళ
- ములుగు జిల్లా వైపు వెళ్తూ ప్రమాదాన్ని చూసి ఆగిన బండి సంజయ్మ
- మహిళను రక్షించి ఆసుపత్రికి తరలింపు

విశ్వంభర, హుజూరాబాద్: బైక్‌పై వెళ్తూ కిందపడి పోయి లారీ కింద ఇరుక్కుపోయి కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవతో తృటిలో ప్రాణాలు దక్కించుకున్న మహిళ స్టోరీ ఇది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం సింగాపూర్ శివారులో ఉదయం ఓ ప్రమాదం జరిగింది. కరీంనగర్? జిల్లాలోని మానకొండూరు మండలం ఖిల్లడకు చెందిన దివ్యశ్రీ భర్తతో కలిసి హుజురాబాద్?లో పని చేసుకొని స్వగ్రామానికి వెళ్తోంది. బైక్?పై వెళ్తున్న సమయంలో కళ్లు తిరిగి రోడ్డుపై పడిపోయి వెనుక వస్తున్న లారీ కిందకు వెళ్లింది. ఈ ఘటనలో ఆమె జుట్టు లారీ ముందు టైర్, రాడ్ల మధ్య ఇరుక్కుపోయింది. కేకలు వేయడంతో డ్రైవర్ లారీని ఆపేశాడు. అదే సమయంలో అటుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ములుగు వెళు తూ ఘటనా స్థలి వద్ద ఆగారు. లారీ కింద టైర్ పక్కన రాడ్డులో జుట్టు చిక్కుకొని రక్తమోడుతూ వేళాడుతున్న దివ్యశ్రీని చూసి ధైర్యం చెప్పారు. ఇరుక్కుపోయిన జుట్టును కట్టర్ల సాయంతో కత్తిరించి దివ్యశ్రీని బయటకు తీయాలని అక్కడున్న వారికి సూచించారు. తరువాత రక్షించిన తరువాత కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. దివ్యశ్రీ వైద్య ఖర్చులన్నీ తానే భరిస్తానని, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు బండి సంజయ్ ఫోన్‌లో చెప్పారు.

## పెళ్లిళ్లతో భూములు లాక్కొనే చర్యలను అడ్డుకుంటాం: అమిత్ షా



రాంచీ: ఝార?ండ్ లో ఎన్నికల ప్రచారం వాడీవేడీగా జరుగుతోంది. తాము అధికారంలోకి వస్తే.. చొరబాటుదారులను గుర్తించి, తరిమేస్తామని భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. వారు లాక్కున్న భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివాసీ మహిళలను పెళ్లి చేసుకున్న చొరబాటుదారుల పేరుమీదకు భూమి బదలాయింపును నిరోధించేలా చట్టాన్ని తీసుకువస్తామన్నారు. "ఝార?ండ్‌లో ఆదివాసీ జనాభా తగ్గిపోతోంది. మన అమ్మాయిలను పెళ్లి చేసుకొని, చొరబాటుదారులు భూములను లాక్కుంటున్నారు. దానిని నిరోధించేలా చట్టాన్ని తీసుకువస్తాం. అలాగే వారిని గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం" అని అమిత్ షా వెల్లడించారు. ఈ చొరబాటుదారుల అంశాన్ని లేవనెత్తినందుకు మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్‌ను అవమానించారని, ఒత్తిడి తీసుకువచ్చి సీఎం పదవికి రాజీనామా చేయించారని విమర్శించారు. అధికార కూటమి జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీల నేతలు తమ వ్యక్తిగత పురోగతి కోసమే పనిచేస్తూ, అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే అలాంటి అవినీతిపరులను జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## ప్రతిపక్ష హోదా ఇస్తేనే.. అసెంబ్లీకి వస్తాననడం
# సిగ్గుచేటు : ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల




విశ్వంభర, విజయవాడ: ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతాననడం వైసీపీ అధ్యక్షుడు జగన్ అవివేకం, అజ్ఞానానికి నిదర్శనమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఆయన తీరు అత్త మీద కోపం దుత్తపై చూపినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు జగన్‌ను ఉద్దేశిస్తూ షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు."ప్రజలు ఓట్లేసింది.. అసెంబ్లీ మీద అలగడానికో, మైకు ఇస్తేనే వెళ్తానని మారాం చేయడానికో కాదు. మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించింది ఇంట్లో కూర్చొని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు. మీ స్వయం కృతాపరాధం ప్రతిపక్ష హోదాకి దూరం చేస్తే.. ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతాననడం మీ అవివేకం, అజ్ఞానానికి నిదర్శనం. అసెంబ్లీ ప్రజాస్వామ్య దేవాలయం. ప్రజా సమస్యల పట్ల అధికార పక్షాన్ని నిలదీసేందుకు ప్రజలు ఇచ్చిన గొప్ప అవకాశం. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా గొంతుకయ్యే అవకాశం వైకాపాకు ప్రజలు ఇస్తే.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తామనడం సిగ్గు చేటు. ప్రతిపక్షం లేకుంటే సభలోనే ప్రజాపక్షం అవ్వాలనే ఇంగితం కూడా లేకపోవడం బాధాకరం.1994లో కాంగ్రెస్ పార్టీ 26 సీట్లకే పరిమితమైనా కుంగిపోలేదు. మీలా హోదా కావాలని మారాం చేయలేదు. 26 మంది సభ్యులతో సభలో ప్రజల పక్షంగా నిలబడ్డాం. 2014లో కేంద్రంలో 44 సీట్లకే పరిమితమైనా.. 2019లో 52 సీట్లే వచ్చినా ప్రతిపక్ష హోదా కావాలని అడగలేదు. హోదా లేకున్నా రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ప్రజా సమస్యలపై తమ గొంతు వినిపించారు. ఇప్పటికైనా అసెంబ్లీకి వెళ్లండి. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయండి. అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే వైకాపా శాసనసభా పక్షం మొత్తం రాజీనామాలు చేయండి. అప్పుడు ఇంట్లో కాదు.. ఎక్కడైనా కూర్చుని తాపీగా మాట్లాడుకోండి" అని షర్మిల ఘాటుగా పేర్కొన్నారు.

## ఏసీ బస్సుల్లో మెట్రో బస్ పాస్‌లకు 10శాతం రాయితీ!
## టీజీఎస్ఆర్టీసీ శుభవార్త



విశ్వంభర, హైదరాబాద్: మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త అందించింది. తమ వద్ద ఉన్న బస్‌పాస్‌లతో లహరి, రాజధాని, గరుడ ప్లస్, ఈ-గరుడ, తదితర ఏసీ సర్వీసుల్లో ప్రయాణిస్తే టికెట్‌పై 10 శాతం రాయితీని ప్రకటించింది. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అన్ని టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని తెలిపింది. మెట్రో ఎక్స్‌ప్రెస్‌తో పాటు మెట్రో డిలక్స్, గ్రీన్ మెట్రో, ఎయిర్ పోర్ట్ పుష్పక్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులు ఈ రాయితీని పొందవచ్చు. వచ్చే ఏడాది జనవరి 31 వరకు 10 శాతం రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొంది. 'హైదరాబాద్‌లో సుమారు 70 వేల వరకు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్ పాసులున్నాయి. వారిలో ఎక్కువ మంది వీకెండ్‌లో సొంతూళ్లకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే బస్‌పాసుదారుల సౌకర్యార్థం ఏసీ సర్వీసుల్లో 10 శాతం రాయితీని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in లో ముందస్తు రిజర్వేషన్ చేసుకుని రాయితీని పొందవచ్చు. జనరల్ బస్‌పాస్ దారులు 10 శాతం డిస్కౌంట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం' అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.



# బోర్డర్ గావస్కర్ ట్రోఫీకే ప్రాధాన్యం

- ఆస్ట్రేలియా మమ్మల్ని పట్టించుకోవడం లేదు'
- పాక్ తాత్కాలిక కోచ్ జేసన్ గిలెస్పీ

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. ఆతిథ్య జట్టుతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను పాక్ 2-1తో కైవసం చేసుకుంది. పాకిస్థాన్ టీమ్ 12 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్ గెలవడం విశేషం. అయితే, తమ పర్యటనకు ఆసీస్ ఏ మాత్రం ప్రచారం కల్పించడం లేదని పాక్ తాత్కాలిక కోచ్ జేసన్ గిలెస్పీ అన్నాడు. కానీ, త్వరలో ప్రారంభంకానున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నాడు. ''నిజం చెప్పాలంటే క్రికెట్ ఆస్ట్రేలియా ద్వారా మా వన్డే సిరీస్‌కు ఎలాంటి ప్రచారం జరగలేదు. ఇది కొంచెం ఆశ్చర్యం కలిగించింది. వారు (ఆస్ట్రేలియా) భారత్‌తో జరిగే బోర్డర్--గావస్కర్ ట్రోఫీ టెస్ట్ సిరీస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ సిరీస్‌ను ప్రచారం చేయడంలో ఫాక్స్ క్రికెట్ (ఆస్ట్రేలియా మీడియా) గొప్పగా పని చేస్తోంది. క్రికెట్ ఆస్ట్రేలియా వేటికి ప్రాధాన్యం ఇస్తుందో తెలిసింది. ఇది వారి ఇష్టం. కానీ, నేను ఈ వన్డే సిరీస్ కోసం ఎలాంటి ప్రకటనలు లేదా ప్రమోషన్‌ను చూడలేదు'' అని జేసన్ గిలెస్పీ వివరించాడు. ఆస్ట్రేలియా, పాక్ జట్ల మధ్య నవంబర్ 14 నుంచి మూడు టీ20ల సిరీస్ మొదలవనుంది.ఇదిలా ఉండగా.. ఆసీస్, భారత్ మధ్య నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. ఆస్ట్రేలియా వేదికగా జరిగే ఈ సిరీస్ కోసం ఇప్పటికే ఇరుదేశాలు తమ జట్ల జట్లను ప్రకటించాయి. టీమ్ఇండియా తొలి బృందం ఆదివారం అర్ధరాత్రి బయల్దేరి వెళ్లింది. రెండో బృందం ఇవాళ ఉదయం పయనమైంది. మంగళవారం నుంచి భారత జట్టు ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొనే అవకాశముంది. టీమ్ఇండియాకు ఈ సిరీస్ చాలా కీలకం. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే భారత్ 4-0తో ఈ సిరీస్‌ను సొంతం చేసుకోవాల్సి ఉంటుంది.

## భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ జరగదు: ఆకాశ్ చోప్రా

**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయితే, ట్రోఫీలో పాల్గొనేందుకు భారత జట్టు పాకిస్థాన్‌కు వెళ్లకూడదని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని ఐసీసీతో చెప్పిందని పాక్ క్రికెట్ బోర్డు తెలిపింది. అయితే, భారత జట్టు లేకుండా టోర్నీ జరగదని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. భారత జట్టు ఆడకపోతే టోర్నీ నిర్వహణకు ఆర్థిక చిక్కులు ఏర్పడతాయని పేర్కొన్నాడు.''ఇది ఐసీసీ ఈవెంట్. టోర్నీ కోసం ప్రసారకర్తలు డబ్బు ఖర్చు చేశారు. కానీ, భారత్ ఆడుతుందని ఐసీసీ హామీ ఇవ్వకపోతే ప్రసారకర్తలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రారు. భారత్ ఆడకపోతే ఆదాయం గణనీయంగా తగ్గిపోతుంది. గత పీసీబీ చీఫ్ 2023 వన్డే ప్రపంచ కప్ సమయంలో మేం శత్రు దేశ భూభాగంలోకి వెళ్తున్నామని చెప్పారు. ఒకవేళ భవిష్యత్‌లో పాకిస్థాన్.. భారత్‌తో ఆడకూడదని నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటుంది. పాక్‌లో పర్యటించకపోతే భారత్‌కు కూడా ఇబ్బందులు తప్పవు. ఎందుకంటే ఇది ఆర్థికాంశాలతో ముడిపడి ఉంది. బీసీసీఐ ఆర్థికంగా ఎంతో బలంగా ఉంది. పాకిస్థాన్‌కు అలాంటి పరపతి లేదు. ఇది కఠినమైన వాస్తవం. భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ జరగదని నేను కచ్చితంగా భావిస్తున్నాను. పాకిస్థాన్‌తో సహా ప్రతి జట్టు ఈ విషయాన్ని అర్థం చేసుకుంది. భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే టీమ్ఇండియా పాకిస్థాన్‌కు రాదని, భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించడం సాధ్యం కాదని తెలుసు. టీమ్ఇండియా మ్యాచ్‌లు యూఏఈలో నిర్వహించే అవకాశముంది' అని ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు.

## సిప్ పెట్టుబడులు సరికొత్త రికార్డ్.. అక్టోబర్‌లో తొలిసారి ₹25 వేల కోట్లు

**ముంబయి:** దేశంలో క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక పెట్టుబడులు కొత్త రికార్డు నెలకొల్పాయి. సిప్ విధానంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు తొలిసారి రూ.25వేల కోట్ల మార్కును దాటాయి. అక్టోబర్ నెలలో మొత్తం రూ.25,323 కోట్లు మదుపర్లు పెట్టుబడిగా పెట్టారు. సెప్టెంబర్ నెలలో ఈ మొత్తం రూ.24,509 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయంలో ఈ మొత్తం రూ.16,928 కోట్లుగా ఉందని మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం (యాంఫీ) వెల్లడించింది. కొత్త సిప్ రిజిస్ట్రేషన్ల సంఖ్య 63.7 లక్షలుగా నమోదయ్యాయి. దీంతో మొత్తం సిప్ అకౌంట్లు 10.12 కోట్లకు పెరిగాయి. సిప్ కింద నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ ఏయూఎం 13.30 క్షల కోట్లకు చేరింది. ఈక్విటీ మార్కెట్లైన సెన్సెక్స్, నిఫ్టీ అక్టోబర్ నెలలో 5-6 శాతం మేర పడిన నేపథ్యంలో సిప్ పెట్టుబడులు పెరగడం గమనార్హం. ఇక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి అక్టోబర్ నెలలో నికరంగా రూ.41,887 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 11 రకాల ఈక్విటీ కేటగిరీల్లోనూ పెట్టుబడుల ప్రవాహం కొనసాగాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి నికరంగా రూ.3,542 కోట్లు, మిడ్‌క్యాప్‌లోకి రూ.4,683 కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3773 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.16,863.3 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. సెక్టోరల్, థీమాటిక్ ఫండ్స్ కలిపి రూ.12,278 కోట్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5180 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఫోకస్డ్ ఫండ్స్, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ కేటగిరీలో గడిచిన ఆరు నెలలుగా నిధులు వెనక్కి మళ్లగా.. అక్టోబర్ నెలలో మాత్రం నిధుల ప్రవాహం కొనసాగడం గమనార్హం. ఫోకస్డ్ కేటగిరీలోకి రూ.693 కోట్లు, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌లోకి రూ.383 కోట్లు చొప్పున నిధులు వచ్చాయి. అక్టోబర్ నాటికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (AUM) ఆల్‌టైమ్ గరిష్ఠమైన రూ.66.98 లక్షల కోట్లకు చేరింది.






## ఛాంపియన్స్ ట్రోఫీ.. పాక్ ప్రభుత్వ నిర్ణయంపైనే పీసీబీ ఆశలు!

**ఇస్లామాబాద్:** దాదాపుఎనిమిదేళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు సిద్ధమవుతున్న వేళ.. ఇబ్బందులు తప్పడం లేదు. పాకిస్థాన్ వేదికగా వచ్చే ఏడాది జరగాల్సి ఉన్న ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై సందిగ్ధం కొనసాగుతోంది. భారత జట్టు అక్కడికి వెళ్లేది లేదని ఇప్పటికే బీసీసీఐ స్పష్టంచేసింది. ఇదే విషయాన్ని పాక్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ నివేదించింది. దీంతో పాక్‌కు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. హైబ్రిడ్ మోడల్‌కు ఒప్పుకొనేది లేదంటూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. ఒకవేళ టోర్నీ రద్దయితే ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి. భారత్ లేకుండా ఆడించినా, టోర్నీ నిర్వహించినా ఫలితమదే. దీంతో ఈ నిర్ణయాన్ని తమ ప్రభుత్వం చేతుల్లో పెట్టాలని పీసీబీ నిర్ణయించింది. ఈమేరకు ఐసీసీ పంపిన ఈ-మెయిల్‌ను ప్రభుత్వానికి పీసీబీ పంపినట్లు వార్తలు వస్తున్నాయి.''ఐసీసీ నుంచి మాకు మెయిల్ వచ్చింది. బీసీసీఐ (BCCI) తన జట్టును పంపించడం లేదనేది అందులో సమాచారం. ఐసీసీ టోర్నీ అయిన ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు టీమ్ఇండియా రాదు. ఇదే విషయాన్ని పాకిస్థాన్ ప్రభుత్వానికి పీసీబీ పంపింది. సర్కారు ఇచ్చే సూచనలు, సలహాలపైనే తదుపరి నిర్ణయం ఆధారపడి ఉంటుంది'' అని పీసీబీ (PCB) వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ట్రోఫీ కోసం ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. ఐసీసీ (ICC) మాత్రం షెడ్యూలింగ్ పేరుతో దాన్ని రద్దు చేసే యోచనలో ఉన్నట్లు వార్తలూ వచ్చాయి. హైబ్రిడ్ మోడల్‌కు పాక్ అంగీకరిస్తే.. భారత్ ఆడే మ్యాచులను దుబాయ్ లేదా షార్జా వేదికగా నిర్వహించే అవకాశం ఉంది. భారత్ నిర్ణయాన్ని మాత్రం పాక్ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్, ఇంజమాముల్ హక్ తప్పుబట్టారు. ఐసీసీ టోర్నీలను బీసీసీఐ ఓ జోక్‌గా మార్చేసిందని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు భారత జట్టు వస్తే సకల మర్యాదలు చేసి, సాదరంగా ఆహ్వానిస్తామని ఇప్పటికే పాక్ కెప్టెన్ రిజ్వాన్ తెలిపిన సంగతి తెలిసిందే. అయితే, భద్రతాపరమైన కారణాలతో టీమ్ఇండియాను పంపేందుకు బీసీసీఐ అంగీకరించడం లేదు.

## ట్రావెల్స్‌తో..యాత్రా ఆన్‌లైన్ లిమిటెడ్ భాగస్వామ్యం

**ముంబయి:** దేశీయ అతిపెద్ద కార్పొరేట్ ట్రావెల్ సర్వీసెస్ ప్రొవైడర్, ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ యాత్రా ఆన్‌లైన్ లిమిటెడ్.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ట్రావెల్ మేనేజ్‌మెంట్ కంపెనీ డీడబ్ల్యూ ట్రావెల్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. 2004లో దుబాయ్‌లో ఏర్పాటైన డీడబ్ల్యూ ట్రావెల్స్.. కార్పొరేట్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, వీఐపీ అండ్ లగ్జరీ, లీజర్ ట్రావెల్‌లో ప్రసిద్ధి చెందిన ప్రముఖ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కంపెనీ. ఇక యాత్రా ఆన్‌లైన్ లిమిటెడ్ గురించి చెప్పాలంటే..ఇది 850కు పైగా కార్పొరేట్ కస్టమర్లను కలిగి ఉన్న భారత్‌లోని ప్రముఖ కార్పొరేట్ ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్. ఇది భారత్‌లోని ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీల్లో ఒకటి. ఈ సంస్థ..దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలు, హోటల్ బుకింగ్‌లు, హాలిడే ప్యాకేజీలు, బస్సులు, రైళ్లు, హోం-స్టేలు, క్రూయిజ్‌లకు సంబంధించిన సమస్త సమాచారాన్ని, బుకింగ్ సౌకర్యాన్ని అందిస్తుంది. భారత్ అంతటా సుమారు 1,500 నగరాల్లో 1.08 లక్షల హోటళ్లు, హోం-స్టేలతో యాత్రా ఆన్‌లైన్ లిమిటెడ్ ఒప్పందం కలిగి ఉంది.




## ఫ్రీగా జియో హాట్‌స్టార్ డొమైన్

### రిలయన్స్‌కు దుబాయ్ చిన్నారుల ఆఫర్

**ముంబయి:** ఇటీవల తీవ్ర చర్చకు దారితీసిన జియో హాట్‌స్టార్ డొమైన్ వ్యవహారం మరో కొత్త మలుపు తీసుకుంది. ఈ డొమైన్‌ను తొలుత ఓ యాప్ డెవలపర్ తన పేరుతో రిజిస్టర్ చేసుకోగా.. తర్వాత అది యూఏఈకి చెందిన ఇద్దరు చిన్నారుల చేతికి వెళ్లిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ అన్నాచెల్లెళ్లు దీనిపై కీలక ప్రకటన చేశారు. తాము కొనుగోలు చేసిన జియో హాట్‌స్టార్ డొమైన్‌ను రిలయన్స్‌కు ఉచితంగా ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో రాసుకొచ్చారు. ''కొన్ని రోజుల క్రితం ఈ డొమైన్‌ను మేం దిల్లీకి చెందిన ఓ యువ డెవలపర్ నుంచి కొనుగోలు చేశాం. ఆయన చదువుకు సాయపడాలనే ఉద్దేశంతోనే దీన్ని తీసుకున్నాం. ఆ తర్వాత ఈ డొమైన్ కొంటామంటూ మాకు చాలా మెయిల్స్ వచ్చాయి. అందులో కొన్ని నకిలీ ఆఫర్లూ ఉన్నాయి. కొంతమంది అయితే చాలా మొత్తంలో డబ్బు ఆఫర్ చేశారు. కానీ, మేం దీన్ని విక్రయించబోమని వాళ్లకు స్పష్టంగా చెప్పాం. కొన్ని వారాలుగా దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. మాపై ఎన్నో వార్తలు వస్తున్నాయి. కానీ, మేం ఎలాంటి వివాదాస్పద ప్రచారం కోసం దీన్ని కొనుగోలు చేయలేదు. కేవలం అతడికి సాయం చేయాలనే అనుకున్నాం. అందుకే చాలా చర్చించి ఓ నిర్ణయానికి వచ్చాం. ఈ డొమైన్ రిలయన్స్ వాళ్ల వద్ద ఉంటేనే బాగుంటుంది. వారు కావాలనుకుంటే దీన్ని మేం ఉచితంగా ఇచ్చేస్తాం. ఈ నిర్ణయం వెనుక రిలయన్స్ నుంచి గానీ.. ఏ ఇతర న్యాయ బృందం నుంచి గానీ మాపై ఎలాంటి ఒత్తిడి లేదు. మా ఇష్టపూర్వకంగానే చెబుతున్నాం'' అని ఆ చిన్నారులు పేర్కొన్నారు. అయితే, దీనిపై రిలయన్స్ ఇంకా స్పందించలేదు.జరిగిన వ్యవహారం ఇదీ.. రిలయన్స్, వాల్ట్ డిస్నీ భారత వ్యాపారాల విలీనం నేపథ్యంలో జియోహాట్‌స్టార్ డొమైన్ ఢిల్లీకి చెందిన ఓ యాప్ డెవలపర్ కొనుగోలు చేశాడు. తాను కేంబ్రిడ్జ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ఫుల్ డిగ్రీ ప్రోగ్రామ్ చదవాలనుకుంటున్నానని, అందుకయ్యే ఖర్చును రిలయన్స్ భరిస్తే తాను డొమైన్ విక్రయిస్తానంటూ ముందుకొచ్చాడు. తనకు రూ.కోటి చెల్లించాలని జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నాడు. ఈ అంశం నెట్టింట చర్చకు దారితీసింది. ఆ తర్వాత కొన్ని రోజులుగా సదరు వెబ్‌సైట్ నుంచి ఆ డెవలపర్ మాయమయ్యాడు. అతడి స్థానంలో దుబాయ్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు చిన్నారులు కన్పించారు. జైనం, జీవికగా తమను పరిచయం చేసుకున్న ఆ చిన్నారులు కొన్ని వీడియోలను పోస్ట్ చేశారు. వీరు ఎన్జీవోలతో కలిసి 'సేవక్‌ఆర్మీ' అనే ఎన్జీవోను నిర్వహిస్తున్నట్లు వారి పోస్టులతో తెలిసింది. ఈ పరిణామాలతో జియో హాట్‌స్టార్ డొమైన్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అయితే విలీన ప్రక్రియ అనంతరం దీన్ని కాకుండా మరో పేరుతో ముందుకురావాలని రిలయన్స్‌కు కొందరు సలహా ఇస్తున్నారు.

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పనున్న కేంద్రం




- ఈపీఎఫ్‌వో వేతన పరిమితి రూ.21 వేలకు పెంపు?

**ముంబయి:** ఉద్యోగులకు కేంద్రం త్వరలో గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వేతన పరిమితిని కేంద్ర ప్రభుత్వం పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రూ.15,000గా ఉన్న ఈ సీలింగ్‌ను రూ.21,000కు తీసుకెళ్లాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకొని.. వీలైనంత త్వరగా ప్రకటన కూడా విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.ఉద్యోగుల సంఖ్యను బట్టి ఈపీఎఫ్ఓలో కంపెనీల నమోదు ఉండాలి. ప్రస్తుతం 20 అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు తప్పనిసరి ఈపీఎఫ్ఓలో చేరాల్సి ఉండగా.. దీనిని త్వరలో మరింత తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ఆ సంఖ్యను 10-15కు తగ్గించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే, చిన్న- మధ్య తరహా పరిశ్రమలు మాత్రం ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి.

**కంపెనీలపై భారం పడినా.. ఉద్యోగులకు మాత్రం లాభమే...**

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి పెరిగితే కంపెనీల యాజమాన్యాలపై భారం పడినా.. ఉద్యోగులకు మాత్రం లాభమే జరుగుతుంది. ఉద్యోగి బేసిక్ సాలరీ, డీఏ ఆధారంగా ప్రావిడెంట్ ఫండ్‌కు నగదు మొత్తాలు నెలనెలా జమవుతాయన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఉద్యోగి జీతం నుంచి 12 శాతం, దీనికి సమానంగా యాజమాన్యం ద్వారా మరో 12 శాతం పీఎఫ్ ఖాతాకు వెళ్తుంది. దీనికి సంబంధించిన వేతన పరిమితే ప్రస్తుతం రూ.15,000గా ఉన్నది. దీన్నే రూ.21,000కు పెంచాలని చూస్తున్నారు. ఇదే పెరిగితే ఇప్పటిదాకా రూ.15,000 ప్రాతిపదికన పీఎఫ్ ఖాతాకు జమవుతున్న మొత్తాలు.. ఇకపై రూ.21,000 ప్రాతిపదికన జమవుతాయి. దీనివల్ల ఉద్యోగి రిటైర్మెంట్ ఫండ్‌కు నిధులు పెరుగుతాయి. పదవీ విరమణ సమయంలో మరింత ఎక్కువగా నగదును పొందవచ్చు. కాగా, ఉద్యోగి పీఎఫ్ ఖాతాకు కంపెనీల ద్వారా వెళ్లే 12 శాతంలో 8.33 శాతం సొమ్ము సదరు ఉద్యోగి పెన్షన్ ఖాతాకు వెళ్తుంది. మిగతా 3.67 శాతం ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమవుతుంది. ఉద్యోగి నుంచి తీసుకునే మొత్తాలు మాత్రం పూర్తిగా ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలోకే వెళ్తాయి. అలాగే ప్రభుత్వం నుంచి కూడా 1.16 శాతం ఉద్యోగుల పెన్షన్ పథకంలోకి వచ్చి చేరుతుంది.

**చివరిసారి 2014లో..**

**2014లో చివరిసారిగా పీఎఫ్ సాలరీ లిమిట్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. రూ.6,500ల నుంచి రూ.15,000కు మార్చింది. ఇక 1952లో ఈ పథకం మొదలైంది. అప్పట్నుంచి ఇప్పటిదాకా మొత్తం 8సార్లు పెంచారు. 1952లో రూ.300గా ఉన్నది. అయితే దీన్ని 1957లో రూ.500కు, 1962లో రూ.1,000కి, 1976లో రూ. 1,600కు, 1985లో రూ.2,500కు, 1990లో రూ.3,500కు, 1994లో రూ.5,000కు, 2001లో రూ.6,500కు, 2014లో రూ.15,000కు సవరించారు.**



## ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ ఈక్విటీ మార్కెట్లు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఫ్లాట్‌గా ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ఫ్లాట్‌గా స్థిర పడ్డాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 9.83 పాయింట్ల లబ్ధితో 79,496.15 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 80,102.14 పాయింట్ల నుంచి 79,001.34 పాయింట్ల మధ్య తచ్చాడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 6.90 పాయింట్ల వృద్ధితో 24,141.34 పాయింట్ల మధ్య ముగిసింది. నిఫ్టీ అంతర్గత ట్రేడింగ్ లో 24,336.80 పాయింట్ల నుంచి 24,004.60 పాయింట్ల మధ్య ట్రేడయింది.నిఫ్టీ-50లో 30 స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్, బ్రిటానియా, అపోలో హాస్పిటల్స్, సిప్లా, ఓఎన్జీసీ తదితర స్టాక్స్ 8 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టీసీఎస్, హెచ్ సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టెక్స్ మహీంద్రా తదితర స్టాక్స్ 4.35 శాతం వరకూ లాభాలతో ముగిశాయి. బజాజ్ ఆటో ఫ్లాట్ గా ముగిసింది. నిఫ్టీ స్మాల్ క్యాప్-100 1.20 శాతం, నిఫ్టీ మిడ్ క్యాప్ -100 0.88 శాతం నష్టంతో ముగిశాయి. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫైనాన్సియల్స్, నిఫ్టీ బ్యాంకింగ్ తదితర ఇండెక్సులు నష్టపోగా, నిఫ్టీ హెల్త్ కేర్, మెటల్, మీడియా ఇండెక్సులు ఒక శాతం పతనం అయ్యాయి.

## న్యూ డిజైర్ లాంచింగ్

### రూ.6.79 లక్షల నుంచి ప్రారంభం!

**ముంబయి:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి తన ఫోర్త్ జనరేషన్ సెడాన్ డిజైర్ సోమవారం ఆవిష్కరించింది. కంపాక్ట్ సెడాన్ క్యాటగిరీలో హాట్ కేక్ లా అమ్ముడు పోతోంది డిజైర్. ఈ నేపథ్యంలో డిజైర్ ఫీచర్లు మరింత డెవలప్ చేసి మార్కెట్లోకి తీసుకొచ్చింది మారుతి సుజుకి. భారతీయ కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా డిజైన్, సేఫ్టీ, టెక్నాలజీ, పవర్ ట్రైన్, కంఫర్ట్, సేఫ్టీ, స్టైల్‌గా రూపుదిద్దుకున్నదీ డిజైర్. ఈ కారు ధర సుమారు. 6.79 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. రూ.11 వేలు చెల్లించి ప్రీ బుకింగ్ చేసుకోవచ్చునని గత వారమే మారుతి సుజుకి తెలిపింది. గ్లోబల్ ఎన్-క్యాప్ క్రాష్ టెస్ట్‌ల్లో 5-స్టార్ రేటింగ్ అడల్ట్, చైల్డ్ ఆక్యుపెంట్ సేఫ్టీలో 4-స్టార్ రేటింగ్ కలిగి ఉంటుందీ కారు. మారుతి సుజుకి కార్లలో ఈ రేటింగ్ పొందిన తొలి కారు ఇది. హోండా అమేజ్, హ్యుండాయ్ ఔరా, టాటా టైగోర్ వంటి కార్లకు గట్టి పోటీ ఇస్తుంది. సెడాన్ కార్ల సెగ్మెంట్‌లో 50 శాతం వాటా కలిగి ఉంటుందీ డిజైర్.అర్బన్ డ్రైవింగ్ సూటబుల్ గా ఉంటుందీ మారుతి డిజైర్. గ్లాస్ బ్లాక్ ట్రిమ్, ప్రీమియం టచ్‌తో క్రోమ్ ఫినిష్డ్ బాటం లైన్, డ్యుయల్ టోన్ డాష్ బోర్డు విత్ స్పెసియస్ లే ఔట్, ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటోకు మద్దతుగా 9-అంగుళాల ఫ్లోటింగ్ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంటుంది. సెమీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ తోపాటు కనెక్టెడ్ కార్ టెక్నాలజీ ఉంటుంది. సింగిల్ పేన్ ఎలక్ట్రిక్ సన్ రూఫ్, రేర్ ఏసీ వెంట్స్, రేర్ సెంటర్ ఆర్మ్ రెస్ట్, 360- డిగ్రీ కెమెరా ఫర్ ఎన్‌హాన్స్‌డ్ విజిబిలిటీ అండ్ సేఫ్టీ తదితర ఫీచర్లు ఉంటాయి. సేఫ్టీ కోసం మారుతి సుజుకి డిజైర్ కారులో సమగ్ర రక్షణ కోసం సిక్స్ ఎయిర్ బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఈఎస్పీ), హిల్ హోల్డ్ అసిస్ట్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) విత్ ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూసన్ (ఈబీడీ), అన్ని సీట్లకూ త్రీ-పాయింట్ సీట్ బెల్ట్స్, ఐఎస్ఓఎఫ్ఐఎక్స్ చైల్డ్ సీట్ యాంకర్స్ ఉంటాయి. న్యూ డిజైర్ కారు తాజా మారుతి జడ్- సిరీస్ 1.2 లీటర్ల 3- సిలిండర్, నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ తో వస్తోంది. గరిష్ఠగా 82 హెచ్పీ విద్యుత్, 112 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, ఏఎంటీ ఆప్షన్లలో లభిస్తుంది. న్యూ డిజైర్ కారుపై సబ్ స్క్రిప్షన్ మోడల్ కూడా అందుబాటులో ఉంది. నెలకు రూ.18,248 చొప్పున చెల్లించి సబ్ స్క్రిప్షన్ చేసుకోవాలి. ఇందులో కారు ధర, రిజిస్ట్రేషన్, మెయింటెనెన్స్, ఇన్సూరెన్స్, రోడ్ సైడ్ అసిస్టెన్స్ తదితర ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.







# నవంబరు 17న పుష్ప-2 ది రూల్ గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్

పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైర్... నీయవ్వ తగ్గేదేలే.. పుష్ప ది రైజ్‌లో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ చెప్పిన ఈ మాసివ్ డైలాగులు ఇంకా అందరి చెవులో మారుమ్రోగుతూనే వున్నాయి. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప ది రైజ్' తో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ క్రియేట్ చేసిన సన్సేషన్ అంతా ఇంతా కాదు. తెలుగు సినిమా గురించి ప్రపంచవ్యాప్తంగా మరోసారి మాసివ్‌గా మాట్లాడుకోవడం ఈ సినిమా విషయలో అందరూ చూశారు. ఇక త్వరలోనే ఇండియన్ బిగ్గెస్ట్ ఫిలిం పుష్ప-2 ది రూల్ ద్వారా అల్లు అర్జున్-సుకుమార్‌ల ద్వయం మరో బిగ్గెస్ట్ సన్సేషన్ సృష్టించబోతున్నారు. డిసెంబరు 5 నుంచి బాక్సాఫీస్ కలెక్షన్ల సునామీ రాబోతుంది. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ఇండియన్ బిగ్గెస్ట్ ఫిలిం ప్రమోషన్ కార్యక్రమాలు ఇక ఎగ్రెసివ్‌గా స్టార్ అయ్యాయి. త్వరలోనే ఈ చిత్రం ప్రమోషన్స్‌ను పాట్నా, కలకత్తా, చెన్నయ్, కొచ్చి, బెంగళూరు, ముంబయ్ హైదరాబాద్‌లో ఈ మాసివ్‌గా నిర్వహించబోతున్నారు. ఇందులో భాగంగానే పుష్ప-2 ది రూల్ చిత్రం ట్రయిలర్ లాంచ్‌ను ఈ నెల 17న బిగ్గెస్ట్ ఈవెంట్ ఫర్ ఇండియన్ బిగ్గెస్ట్ ఫిలింగా పాట్నాలో అత్యంత గ్రాండ్‌గా ఈ మాసివ్ ఈవెంట్‌ను నిర్వహించబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ మాసివ్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో గన్‌ను భుజన వేసుకుని మాసివ్, ఫైర్ లుక్‌తో.. తనదైన స్వాగ్‌తో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నడిచొస్తున్న స్టిల్ చూస్తుంటే.. అల్లు అర్జున్ అభిమానులు గూజ్‌బంప్స్ ఖాయం.. ప్రస్తుతం ఒకవైపు చివరి దశలో వున్న చిత్రీకరణతో పాటు మరో వైపు నిర్మాణానంతర పనులను ఈ చిత్రం జరుపుకుంటోంది. ఇక బాక్సీఫీస్ రికార్డులను రూపుమాపడానికి, ఇండియాన్ బాక్సాఫీస్‌ను కలెక్షన్ల సునామీతో ముంచెత్తడానికి అల్లు అర్జున్- బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్‌ల వండర్‌ఫుల్ ఫిల్మ్ పుష్ప-2 ది రూల్ అస్సలు తగ్గేదేలే అనే రేంజ్‌లో ఫుల్ ఫైర్‌తో వస్తోంది... ! అల్లు అర్జున్, రష్మిక మందన్నా, ఫహాద్ ఫాజిల్, రావు రమేష్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు ఈ చిత్రంలో ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

# నవంబర్ 22న విడుదలకు సిద్ధమైన "ఉద్వేగం" మూవీ



కళా సృష్టి ఇంటర్నేషనల్, మణిదీప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో జి శంకర్, ఎల్ మధు నిర్మాతలుగా ప్రేక్షకులు ముందుకు రాబోతున్న చిత్రం ఉద్వేగం. ఈ చిత్రానికి అజయ్ సినిమాటోగ్రాఫర్ గా పని చేయగా కార్తీక్ కొడగండ్ల సంగీతాన్ని అందించారు. త్రిగున్ ముఖ్యపాత్రలో నటించినున్న ఈ చిత్రంలో దీప్సిక కథానాయికగా నటించగా శ్రీకాంత్ భరత్, సురేష్ నాయుడు, పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం టీజర్ సెన్సేషనల్ డైరెక్టర్ ఆర్జీవి చేతుల మీదగా విడుదల కావడం జరిగింది. చిత్రం టీజర్ చూస్తుంటే ఎంతో కష్టపడి తీశారని, అలాగే యాక్టర్ త్రిగున్ కు 25వ చిత్రం కావడం విశేషమని ఆర్జీవి అన్నారు. అంతేకాక కోర్టు రూములో వచ్చే చిత్రాలు చాల తక్కువ అని, ఈ చిత్రం మంచి సక్సెస్ కావాలని తన కోరుకుంటున్నట్లు ఆర్జీవి అన్నారు. కాగా ఇప్పటికే ఈ చిత్రం టీజర్ ఏంతో ప్రేక్షక ఆదరణ పొందింది. 2021లో పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ తర్వాత కోర్టు నేపథ్యంలో మరో సినిమా ఇదే కావడం విశేషం. ఈ నెల 22వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది అని చిత్ర బృందం వెల్లడించింది. చిత్రం: ఉద్వేగం, నటీనటులు: త్రిగున్, దీప్సిక, శ్రీకాంత్ భరత్, సురేష్ నాయుడు, పరుచూరి గోపాలకృష్ణ, శివ కృష్ణ, అంజలి తదితరులు, సంగీతం: కార్తీక్ కొడగండ్ల, సినిమాటోగ్రఫీ: అజయ్ఎడిటర్: జశ్వీన్ ప్రభు, పీఆర్ఓ: హరీష్, దినేష్, నిర్మాతలు: జి శంకర్, ఎల్ మధు, దర్శకుడు: మహిపాల్ రెడ్డి.

# "ఆదిపర్వం"కు హిట్ టాక్.. పెరిగిన థియేటర్లు



టాలీవుడ్ లో ఇటీవల హాట్ టాపిక్ గా మారిన మూవీ "ఆదిపర్వం". ఈ నెల 8న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదలైన ఈ చిత్రం హిట్ టాక్ నేపథ్యంలో మరో 50 థియేటర్లు పెంచుకుంది. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్ టైన్ మెంట్స్ కలయికలో నిర్మించిన ఈ సినిమాలో మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ప్రధాన పాత్రల్లో నటించారు. మరో కీలక పాత్రను ఆదిత్య ఓం పోషించారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా "ఆదిపర్వం" చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు సంజీవ్ మేగోటి. థియేటర్లలో "ఆదిపర్వం" విజయవంతంగా ఆడుతున్న నేపథ్యంలో డైరెక్టర్ సంజీవ్ మేగోటి ఆనందం వ్యక్తం చేశారు. "ఆదిపర్వం"ను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్న చిత్రంగా మొదలై బిగ్ మూవీ మారుతూ రోజురోజుకు థియేటర్లు పెంచుకోవడం చాలా సంతోషంగా ఉండన్నారు. సపోర్ట్ చేసి "ది బెస్ట్ మూవీగా నిలబెట్టిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ చెప్పారు. ఈ చిత్రంలో గ్రాఫిక్స్, యాక్షన్ ఆకట్టుకుంటాయని, మంచు లక్ష్మి గారికి పేరు తెచ్చే చిత్రమవుతుందన్నారు. అలాగే హనుమంతు క్యారెక్టర్ లో ఆదిత్య ఓం నటన హైలైట్ గా నిలుస్తుందన్నారు. త్వరలోనే ఈ సినిమా విజయ యాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు



# ఓ ఇంటివాడైన క్రిష్

'గమ్యం'సినిమాతో తో తొలి ప్రయత్నంలోనే దర్శకుడిగా సత్తా క్రిష్-డాక్టర్ ప్రీతి చల్లా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సోమవారం జరిగిన వారి వివాహ వేడుకకు హైదరాబాద్ వేదికైంది. పెళ్లి వేడుకకు ఇరు కుటుంబాల బంధుమిత్రులు, కొద్దిమంది అతిథులు హాజరైనట్టు సమాచారం. ప్రీతి.. గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. 'వేదం', 'కృష్ణం వందే జగద్గురుమ్', 'ఎన్టీఆర్: కథానాయకుడు', 'ఎన్టీఆర్: మహానాయకుడు' తదితర చిత్రాలు క్రిష్ తెరకెక్కించినవే. ప్రస్తుతం.. అనుష్క ప్రధాన పాత్రలో 'ఘాటి' సినిమా తెరకెక్కిస్తున్నారు. క్రిష్ పెళ్లి ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# తెలంగాణ వాళ్లు ఎన్నో గొప్ప చిత్రాలు తీశారు



## చిన్న సినిమాలకు సహకారం అందిస్తా..

- తెలంగాణలో సినిమా పరిశ్రమ బాగా అభివృద్ధి చెందాలనేది మా ప్రభుత్వ సంకల్పం
- టీఎఫ్‌సీసీకి 800 గజాల స్థలం ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తాం
- చిత్రపురి కాలనీలో కొత్తగా కట్టబోయే ఫ్లాట్స్ లో తెలంగాణ సినిమా వారికి ఇప్పిస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- చిన్న సినిమాలకు థియేటర్స్ ఇవ్వడం లేదు: టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్
- టీఎఫ్‌సీసీకి మంత్రి కోమటిరెడ్డి నుంచి మరింత సహకారం కావాలి: డా.కాచం సత్యనారాయణ



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ సంస్థల అధినేత రమేష్ ప్రసాద్ మరో అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోటీఎఫ్ సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ - ఈ రోజు మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు ఎన్నికైన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా రావడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా మా సంఘం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాం. తెలంగాణ సినీ కార్మికులు సభ్యులుగా ఉన్న తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం రెంట్ తీసుకుని నిర్వహిస్తున్నాం. ఫిలింనగర్ లో 800 గజాల స్థలం ఇప్పించగలరని కోరుతున్నాం. ఆ స్థలంలో సొంత కార్యాలయం నిర్మించుకుంటాం. నేను ఫిలిం ఇండస్ట్రీకి వచ్చి దాదాపు 30 సంవత్సరాల పైన అవుతుంది. 40 సినిమాల వరకు ప్రొడ్యూస్ చేయడం జరిగింది. ఒక ఎనిమిది సినిమాలో డైరెక్షన్ చేయడం జరిగింది, అలాగే 250 సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేయడం చేశాను. .మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ లో ఉన్న ఏ ఒక్క కార్మికునికి కూడా చిత్రపురి కాలనీలో ఇల్లు ఇవ్వలేదు, కాబట్టి మా చాంబర్లో ఉన్న కార్మికులందరికీ ఇల్లు ఇప్పించాలని కోరుతున్నాను. మా తెలంగాణలో ఉండే కొందరు బడా నిర్మాతలు మంత్రి గారి పి ఏ లకు ఫోన్ చేసి మంత్రిని ఫంక్షన్కు రాకుండా చూసుకోండి అని చెప్పారు, అయినా ఎవ్వరిని లెక్కచేయకుండా మంత్రి మా ప్రోగ్రాంకు రావడం నిజంగా చాలా చాలా సంతోషం. రావడమే కాదు మేము అడిగిన కోరికలన్నీ తీరుస్తానని చెప్పారు వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు. పెద్ద సినిమాలకు టికెట్ రేట్స్ పెంచుకోవచ్చు. కానీ చిన్న చిత్రాలకు టికెట్ రేట్స్ హైక్ అవసరం లేదు. థియేటర్స్ లో చిన్న సినిమా రిలీజ్ కు క్యూబ్, యూఎఫ్ వో వంటి కంటెంట్ ప్రొవైడర్స్ కు తమిళనాట 2500 ఉంటే మన దగ్గర 10 వేలు వసూలు చేస్తున్నారు. ఇండస్ట్రీలోని కొందరు పెద్దలు ఈ కంపెనీలకు మద్ధతుగా ఉన్నారు. నేను గతంలో నిరాహార దీక్ష చేస్తే 3 వేల వరకు ఈ ఛార్జీలు తగ్గించారు. ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకోవాలి. అలాగే చిన్న సినిమాలకు థియేటర్స్ ఇవ్వడం లేదు. మా సభ్యుల్లో కొంతమందికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాలని కోరుతున్నా అన్నారు.టీఎఫ్ సీసీ వైస్ ప్రెసిడెంట్ గురురాజ్ మాట్లాడుతూ - మంచితనానికి మారుపేరు మా మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఆయన ఈ రోజు మా ఈవెంట్ కు రావడం సంతోషంగా ఉంది. ఈ వేదిక మీద నుంచి మంత్రి కి ఒక విన్నపం చేస్తున్నాం. చిత్రపురి కాలనీలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయి. వాటిపై మీరు దృష్టి సారించాలి. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా ఎంతోమందికి హెల్ప్ చేస్తున్న రామకృష్ణ గౌడ్ గారితో మేము జర్నీ చేస్తుండటం సంతోషంగా ఉంది అన్నారు.టీఎఫ్ సీసీ సెక్రటరీ జేవీఆర్ మాట్లాడుతూ - తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు ఎన్నికైన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా రావడం ఆనందంగా ఉంది. ఆయనకు మా అసోసియేషన్ తరుపున కృతజ్ఞతలు చెబుతున్నాం. చిన్న చిత్రాల విడుదల విషయంలో ప్రభుత్వం తమ సహకారం అందించాలి. 200 చిన్న చిత్రాలు నిర్మితమైతే అందులో 10 శాతం కూడా థియేటర్స్ లో రిలీజ్ కావడం లేదు అన్నారు.

టీఎఫ్ సీసీ సెక్రటరీ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ - ఎన్నో బిజీ కార్యక్రమాల్లో ఉండి కూడా మా సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నాం. 2014లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పడింది. సుమారు 16 వేల మంది సభ్యులు 24 విభాగాల నుంచి ఉన్నారు. వారి సంక్షేమం కోసం మా అసోసియేషన్ చేస్తున్న కార్యక్రమాల్లో ప్రభుత్వం తరుపున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సపోర్ట్ ఎప్పుడూ ఉంటుందని కోరుకుంటున్నాం అన్నారు. ఇకముందు మరింత సహకారం కావాలన్నారు.

టీ మా ప్రెసిడెంట్ రశ్మి ఠాకూర్ మాట్లాడుతూ - ముందుగా మా సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నాం. ఈరోజు మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం మాకెంతో ప్రోత్సాహాన్ని బలాన్ని ఇస్తోంది. ఈ ప్రభుత్వం మా టీఎఫ్ సీసీ సభ్యుల సంక్షేమానికి సపోర్ట్ అందిస్తుందని ఆశిస్తున్నాం అన్నారు.

నటి కవిత మాట్లాడుతూ - రామకృష్ణ గౌడ్ లో తోటి వారికి సహాయం చేయాలనే తపన ఉంటుంది. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో నేను చూసిన ప్రత్యేకత ఏంటంటే కొత్త వాళ్లు ఎవరైనా సినిమా చేయాలని వస్తే ప్రతి విషయంలో ఈ సంస్థ సభ్యులు సహకారం అందిస్తారు. ప్రారంభం నుంచి సెన్సార్ వరకు సపోర్ట్ చేస్తారు. ఇలాంటి అసోసియేషన్ మరింతగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నా అన్నారు.

టీ మా సెక్రటరీ స్నిగ్ధ మాట్లాడుతూ - మా అసోసియేషన్ తరుపున నటీనటులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మా వంతు పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నాం. మహిళా ఆర్టిస్టులకు ఇండస్ట్రీలో ఎప్పుడు సమస్య వచ్చినా మా దగ్గరకు రావొచ్చు. కొత్త నటీనటులకు మరింతగా అవకాశాలు పెరగాలని కోరుకుంటున్నా. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వం తరుపున తమ సపోర్ట్ అందిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.

హీరో కిరణ్ మాట్లాడుతూ - నాకు సినిమా అంటే ప్రాణం. సినిమా తప్ప మరో ప్రపంచం తెలియదు. నేను తెలుగులో 22, తమిళంలో 2 చిత్రాల్లో నటించాను. సినిమా కోసం ఎంతో కష్టపడినా అవి థియేటర్స్ లో రిలీజ్ కు నోచుకోలేదు. ఎంతో బాధగా ఉండేది. చిన్న చిత్రాల థియేట్రికల్ రిలీజ్ విషయంలో ప్రభుత్వం తమ చొరవ చూపించాలి అన్నారు.

ప్రసాద్ సంస్థల అధినేత రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ - తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్గనైజ్ చేసిన ఈ ఈవెంట్ కు అతిథిగా రావడం సంతోషంగా ఉంది. ఎన్నికైన సభ్యులకు నా బెస్ట్ విశెస్ అందిస్తున్నా. తెలుగు సినిమా ప్రస్తుతం ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చుకుంటోంది. సొసైటీకి మంచి ఆలోచనలు చెప్పేందుకు సినిమాను మించిన గొప్ప మాధ్యమం లేదు. ఆ క్రమంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా భాగమవడం ఆనందంగా ఉంది అన్నారు.

సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ - తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు ఆరోసారి ఛైర్మన్ గా ఎన్నికైన రామకృష్ణ గౌడ్ కి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఈ అసోసియేషన్ ద్వారా వారు ఎంతోమందికి సపోర్ట్ అందిస్తున్నారు. నాకు సినిమాలంటే ఇష్టం. అయితే చిత్ర పరిశ్రమ ఎవరో ఐదారుగురు పెద్ద వారిదే కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో సినిమా పట్ల ఆసక్తి ఉన్న అందరిదీ. అందరికీ నటన రాదు. వచ్చిన కళాకారులకు మనం సపోర్ట్ గా నిలబడాలి. మా భూమి నుంచి మొన్నటి బలగం వరకు తెలంగాణ వాళ్లు ఎన్నో గొప్ప చిత్రాలు తీశారు. తెలంగాణలో సినిమా పరిశ్రమ బాగా అభివృద్ధి చెందాలనేది మా ప్రభుత్వ సంకల్పం. నా దగ్గరకు థియేటర్స్ ఇప్పించమని వచ్చే ప్రతి చిన్న సినిమా వారికి నా సహకారం అందిస్తున్నా. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కు 800 గజాల స్థలం ఇప్పించేందుకు ప్రభుత్వం తరుపున ప్రయత్నం చేస్తాం. అలాగే చిత్రపురి కాలనీలో కొత్తగా కట్టబోయే ఫ్లాట్స్ లో మన తెలంగాణ సినిమా వారికి ఫ్లాట్స్ ఇప్పిస్తాం. మీకు ఏ సహకారం కావాలన్నా ప్రభుత్వం తరుపున గానీ, వ్యక్తిగతంగా నా తరుపున గానీ చేస్తానని హామీ ఇస్తున్నా అన్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com